ఆంధ్రసాహిత్యపరిషత్ప్రచురణము. ౪౦.

శ్రీ

రఘునాథరామాయణము.

రఘునాథభూపాలప్రణీతము.

మొదటి భాగము.

కాకినాడ:

ఆంధ్రసాహిత్యపరిషత్తువారిచేఁ

ప్రకటింపఁబడినది.

కాకినాడముద్రాక్షరశాల,

వెల రు 0-8-0.

1937.

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౬. { ఈశ్వరనామసంవత్సరము. శ్రావణభాద్రపదమాసములు. } సంచిక 3.

పాల్కురికి మతరహస్యము.

—యామిజాల పద్మనాభస్వామిగారు, విజయనగరము.—

సోమనాథుని మతము వీరశైవ మని తద్గ్రంథపాఠకులకును, దత్తాలపేసిక్షిల్లులకును దెల్లంబ.

సోమనాథుఁడు శ్రుతివాక్యముల నుదాహరించుచు సర్వము పశుపతి పరముగ సమన్వయించిన శైవపండితుఁడు. ఆరాధ్యవంశమునకుఁ జెందిన విప్రుఁ డయ్యు శైవాచారదీక్షాధురంధరుఁడై వర్ణనిర్ణయమును జేసికొనఁ డయ్యె. శ్రియాదేవియు, విష్ణురామదేవుఁడును గారవింపఁగ నొప్పుగాదిలిసుతుఁడే కాని గురులింగవరకరోదరజనితుఁ డఁట. కన్నవారినేని ననహియ్యంచు నాశైవనియమప్రభావ మయ్యారే;—భవిజననమాదరణసంభాషణాదిసంసర్గదూరగుఁడు. తనకు జన్మలేదని యాత్మేంద్రియసంతృప్తిగావించుకొనినాఁడు. ధర నుమా మాతా పితా రుద్ర యనఁగఁ బరఁగినవాఁడు. "కర్మంబు త్రాళ్లు తాఁ గట్టుకోఁదగునె?" అని కర్మనునిందించిన మానిసి, శిలాదునిచేతను, నందీశ్వరునిచేతను ఘోరతపస్సు చేయించినాఁడు. నందికేశ్వరునినోము, తద్విధియుఁ జెప్పి యొప్పించినాఁడు. శ్రుతులను, స్మృతులను నొకవంక నాదరించుచునే కథనడిపినాఁడు. సంధ్యావందనము నల్పినచో దేవత లందఱను బ్రొముక్కవలె

నఁట. దాన నయ్యది దూష్య మని కేవల శివశివభక్తనామసంస్మరణమే కర్తవ్య మని కులసతియట్లు నిశ్చలయుక్తి భక్తి; వెలయాలియట్టు లవిప్రమార్గంబు." అని విప్రమార్గమును నిందించుట యాతనియిష్టము. భక్తియే చాలును. కర్మాచరణ మకర్తవ్య మనుట యాతని యాంతరంగిక ముఖ్యోద్దేశము. శాపమునకు శక్తికల దని యంగీకరించుచుఁ గర్మాచరణముల భక్తినిఁ బోలినది లే దనుట యాతని సిద్ధాంతము. శత్రు లైనను లింగసహితు లై యున్నచో నాదరించుట యాతనిదినకృత్యము. చిత్తజాంతకుభక్తిఁ జెడనాడు ఖలుల మృత్యువుగతిఁ గ్రుంచుట తన్మతపరమసిద్ధాంతము. పరస్త్రీపరాఙ్ముఖత యాతని మతిమహాపాయుపథమున నాఱని విద్యుద్దీపిక. ప్రపంచము కలదు. అధీశ్వరుఁడు మాత్రము పశుపతి. దేవత లందఱును గలరు, అందఱును శివాంశసంభూతులు. జీవాత్మ వేఱు. జీవుఁడు దుష్కర్మి. శివుఁడు నిష్కర్మి. ఆత్మ పంచభూతాత్మకము. శివుఁడు సృష్టికపటనాటకసూత్రధారి. శివుఁడు నిర్మలుఁడు. అంగము పుణ్యపాపాలయము. నిష్కర్మి యైనశివునకును, అంగమునకును సంబంధము లేదు. తనయిచ్ఛాప్రభావమున సర్వమును బుట్టించిన శివునకుఁ దత్సంబంధిత్వ మంటఁగట్టుట యజ్ఞత్వము. మృతుఁడు లేఁడనినవాని నడుతల మెట్టి నడచుట వీరశైవులయాచారము. శివభక్తులు శివభక్తునిఁ జేరి నీభార్య చీరని మ్మనినచో నిచ్చితీఱవలెను. చచ్చితీఱవలెను. శివభక్తుఁడు చచ్చినదానిని బ్రదికింపఁగలఁడు. బ్రాహ్మణులు త్రాటిమాలలు, పచ్చిమాలలు నఁట. ఇరుగడలఁ గ్రిక్కిటిసియున్నయద్వైతబౌద్ధమతమున నడఁచి తన్నియమస్వీకారాశక్తనికృష్టజాతీయులను సులభమోక్షప్రాప్తిపరమసాధనపరశివభక్తి శక్తిని తనలోఁ గొనివారితోఁ గూడి జనబాహుళ్యముచే మన్ననఁగొనుట యతని హృదయసమ్మతమగు మతము. విషము త్రావినను, కన్నులు పెఱికికొనినను, తలనఱికికొనినను భయము లేదు. ప్రాణాపాయము రాదు. అంతయు శివప్రీణనమున కై చేయుచున్న వీరశైవమతమార్గము. దాని కడ్డుతవులరాదు. వర్ణాశ్రమధర్మములు పాటింపరాదు. బసవనికి వడుగు చేయింపలేదు. అద్వైతులును, సాంఖ్యులును, జైనులును, బౌద్ధులును, నేశ్రుతిస్మృతులతోడ, యుక్తివాదములతోడఁ దమ

మతములకుఁ బ్రాబల్యము సంఘటింపవారకొనిరో యాపద్ధతినే సోమనాథుని కరగ్రహణ మొనర్చి యప్రతిహతగమనముతో నితరశైవభిన్న మతమార్గములను జక్క దిద్దుకొని యితరమతములను రేకెత్తకుండఁ జేసినది. బాగుగా నాలుగుభాషలలోఁ బాండిత్యము గలదిట్ట. లక్కపుకు కవంటి సంస్కృతవాణిని నాటవెలఁదినిజేసి మించిన కీర్తి గడించి యితర భాషలం గబ్బములు రచించి ప్రాచీనమతముల నింకించి నటించి వీరశైవ నిరాటంకఘంటాపథప్రవర్తకుఁ, గుర్వాజ్ఞః చెల్లించుకొనినవాఁడు పాల్కురికి సోమనాథుఁడు.

"ప్రశంస."

— విద్వాన్ పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు —

సీ. శ్రీజయంతికులాబ్ధిశీతభానుఁడు రామ
  యార్యుండు జనకుఁడై యలరుచుండఁ
బీఠికాపురమహీభృన్మాళి సూర్యరా
  ట్ప్రభుప్ర పోషకుఁ డయి ప్రబలుచుండ
రాజాధిరాజ విక్రమదేవవర్మభూ
  నేత యధ్యక్షుఁడై నెగడుచుండ
సంస్కృతాంధ్రజ్ఞాన సంపూర్ణులైన
  విద్వాంసులు సభ్యులై తనరుచుండఁ
బంచవింశతివత్సరప్రాయమందు
మందగతి రాజతోత్సవానందలీల
ననుభవించితి సాటి నీ కవనిఁ గలదె
యాంధ్రసాహిత్యపరిషదబ్జాయతాక్షి!
ఉ. నన్నయభట్టు తిక్కకవినాయకుఁ డెఱ్ఱన నీకుఁ దండ్రులై
మన్ననఁ జేసినారు, నిను మానిని! నాచనసోమనాథ పో

తిన్నలు పెంచినారు, బహుధా భవదీయవిలాససంపద
భ్యున్నతిఁ గృష్ణరాయఁడు ప్రభుప్రవరుం డొడఁగూర్చినాఁడు పె
ద్దన్నయు ముక్కుతిమ్మన సుధామధురోక్తుల నేర్పినారు త్యా
గన్న కృతుల్ రచించిన మహాత్ముఁడు గానము చెప్పినాఁడు సూ
రన్న కథాదమత్కృతుల కాకరముం బొనరించి శ్లేషసం
పన్న నొనర్చినాఁడు బహుభంగములం బడి, చేమకూర వెం
కన్న మఱెవ్వరుం బడయఁగాని పథంబునఁ ద్రిప్పినాఁడు, పీ
రన్న మదీయరాజ్ఞి యని యాదరణం బొనరించినాఁడు, తి
ప్పన్న వచించినాఁడు తగ భాణపథంబును, గూచిమంచి తి
మ్మన్నయుఁ బొన్నగంటి తెలఁగన్నయు నచ్చతెనుంగుదానిఁగా
ని న్నొనరించినారలు గణింపఁగ నెల్లరు, నాంధ్రసాహితీ
సన్నుతగాత్రి! నీకుఁ దగుసాటి జగంబుననెందుఁ గల్గునే ?.

ఉ. ఇంక నవీనసత్కవు లనేకులు చిన్నయసూరిముఖ్యు లే
వంక భవద్యశఃకుసుమవల్లరిఁ బ్రోదిఁ బొనర్చిరో నిరా
తంకముగాఁ ద్వదీయసవిధంబున నిన్నెద నాంధ్రసాహితీ
పంకజనేత్ర! యొక్కపరి భావనసేయుము దాని నెమ్మదిన్.

సీ. నన్నయవ్యాకరణంబు నథర్వణ
కారికావళి మున్నుగాఁగఁ గలుగు
వ్యాకరణంబులు ప్రామాణికకవిప్ర
యోగంబులును జూచి యుక్తరీతిఁ
దెనుఁగువ్యాకరణంబు దీర్చిదిద్దినవాఁడు
గద్యకావ్యంబుల కాద్యగురుఁడు
చిన్నయసూరి నీచెలువంబునకుఁ గొంత
క్రొత్తందనంబును గూర్చినాఁడు
కడచన్న యాంధ్రసత్కవిజీవితచరిత్ర
సేకరించినవాఁడు స్వీయచరిత

రచనకాంధ్రమున మార్గము చూపినయతండు
　　ప్రహసననిర్మాణపటుమనీషుఁ
డిది యది యననేల యెల్లమార్గంబుల
　　శోధించినట్టి విశుద్ధబుద్ధి
వీరేశలింగకవిబ్రహ్మ నిన్నెల్ల
　　తెలుంగుల వృద్ధికిఁ దెచ్చినాఁడు
కనఁజేసినాఁడు లక్ష్మణరాయఁ డొకకొంత
　　విజ్ఞానసర్వస్వవిమలకీర్తి
యభినవకృష్ణరాయాస్థానికి నన ర్ఘ
　　రత్నభూషణములు రామకృష్ణ
కవులు నిన్నుఁ బ్రసాదకలితఁగా నొనరింప
　　భావించి కవితఁ జేపట్టినారు
బ్రహ్మఁ దిమ్మనిఁ దిమ్మఁ బ్రహ్మనిఁగా సమ
　　రించి మెప్పించెడి ధీయుతుండు
హాస్యరసాంబుధి నాదమించినప్రౌఢ
　　నాటకగ్రంథసంధానచణుఁడు
లక్ష్మీనృసింహరాయాత్మాసురాగ్రణి
　　నీప్రోలి సాక్షియై నిలిచినాఁడు
నూటికెక్కువ గాఁగ ధాటిమై గ్రంథముల్
　　రచియించినట్టి ధీరప్రశస్తి
యొకచేతివాఁడఁ బాయక భారతంబెల్ల
　　నాంధ్రీకరించినయట్టిదిట్ట
శ్రీపాద కృష్ణమూర్తిబుధుండు నీచేత
　　నితిహాసరచనఁ జేయించినాఁడు
తిరుపతివెంకటేశ్వరసుధీవరు లవ
　　ధానాశుకవితాప్రధానగురువు

లాంధ్రదేశమ్మునం దఖిలస్థలంబుల
నీరాజనం బిచ్చినారు నీకు
వారిమార్గమునందె వర్తించిన మహాత్ముఁ
డస్మదగ్రజుఁడు చిదంబరకవి
యాసేతుశీతనగావనీనాయకు
లిచ్చినకాన్క లందిచ్చినాఁడు
హరికథాసృష్టికి నరవిందగర్భుండు
సంగీతకవితావిశారదుండు
నారాయణుఁడు నీకు నట్టువై నృత్యంబు
గఱపి ప్రశస్తిని గాంచినాఁడు
పూర్వరాజులు నిన్నుఁ బోషించిన చరిత్ర
శాసనంబులు విప్పిచదువుదంట
రామసూర్యుఁడు సూర్యరాయమహీపాలు
నాదరణాతిశయంబువలనఁ
బండితమండలీపరివృతుండు నిఘంటు
తారహారము నీకుఁ దగినదానిఁ
గూర్చుచున్నాఁడు తొలిపేట కొని ధరింపు
మచిరకాలంబునన తక్కినట్టిపేట
లును ధరించెద-నీమాలికను ధరింపు
మాంధ్రసాహితీపుండరీకాయతాక్షి !

—చిత్రపటప్రశంస—

—వెంకరాల సూర్యనారాయణశాస్త్రిగారు—

క. శ్రీమజ్జయంతివంశమ
హాముక్తామణిని రామసూర్యుని సతతం
బోమును ముక్తీశ్వరుఁడు ని
రామయపురుషాయుషాభ్యుదయము లొసఁగుచున్.

సీ. ఆంగ్లభాషాదేవి యనుకంప నాదిని
బట్టభద్రుం డయికరఁగుసుకృతి
గీర్వాణభారతీకీలకంబుల శ్రద్ధ
నామూల మెఱిఁగినయట్టిప్రోడ
యాంధ్రసరస్వతి యంఘ్రము లారాధించి
మాన్యతఁ బాఁగిన మహితమూర్తి
కర్ణాటశారదాకరుణామృతము సైత
మాని గఱ్ఱని తేర్చినట్టిదిట్ట
బహుశిలాతామ్రశాసనప్రకటనక్ర
మప్రవీణుఁడు నిరుపమానప్రభావుఁ
డాంధ్రసాహిత్యపరిషల్లతాంగిఁ గన్న
యతఁడు గాఁడె జయంతి రామార్యుఁ డనిన.

సీ. కవియనాఁ గవినన్న నెవఁడైన వానిలోఁ
తరసి కాన్క లొసంగ కనుపలేఁడు
శాస్త్రజ్ఞుఁడ నటంచుఁ జనుదెంచు నెవ్వాని
ననుపొందఁ బూజింప కనుపలేఁడు
వరుస వేదజ్ఞులు వచ్చుచో నెవని వ
స్త్రాశనమ్ము లొసంగ కనుపలేఁడు
ఇతరవిద్యల నెవ్వియేని నేర్చినవారి
నాదరింపక యెన్నఁ డనుపలేఁడు

ప్రాభవమ్ము విద్యావైభవమ్ము గల్గి
యిట్లు విద్యార్థికులఁ బ్రోత్సహించునట్టి
మాన్యచరితుం డెవండు రామయ్యపంతు
లొక్కఁడే కాక యెన్నాళ్ళ లెక్కయిడిన.

శా. ఆచంద్రార్కము నిల్చు చందమున సూర్యారాయభూపాహ్వయ
శ్రీదిహ్మాంబు నిఘంటుశేఖరము వాసిన్ గూర్చి యాంధ్రావనిన్
వాచాగోచరరీతి శారదకు సంధానించె సామ్రాజ్యము
ర్వీచక్రం బరుదంద రామయబుధాగ్రేయుండు సామాన్యుఁడే.

ఉ. కంటను వత్తివెట్టుకొని గారవమొప్పఁ దెలుంగుబాసవా
ల్గంటికి నీవు గూర్చినవికాసమున్ స్మరియించి యాంధ్రు లిం
టింటను నీకుచిత్రపట మేడ్తఱ నిల్పి యఖండభక్తి, దో
యింటి నొనంటఁ జేర్చి భజియించిన నీఋణ మీఱఁగనేర్తురే.

శా. ఎందాఁకన్ విలసిల్లు నాంధ్రమహియం దేకాక్షరీన్ శారదా
సందక్రీడలు సజ్జనుల్ వొగడఁ; నందాఁకన్ విపశ్చిన్మనో
బృందంబందు భవత్తనూవిలసచ్ఛ్రీ చిత్రితాకారమై
యందంబొందు నటంచు నీకటము రామయ్యార్య ! చాటెంజుమీ.

గీ. సర్వసంపత్సమృద్ధి యశఃప్రసార
మొనయు నీకది యిష్టి యిష్టబంచుఁ
గోరఁ బరమేశ్వరుని, గాని కోరువాఁడ
నొక్కటే నీకుఁ జిరతరాయుష్యమీయ.

“ ఉచ్చైర్గతి” యనుశ్లోకమునకుఁ దెనిఁగింపు.

గీ. శ్రుతిని సద్గతి ధర్మంబు చేతనేని
దానికిం బ్రమాణంబు వేదంబు లేని
బ్రాహ్మణులు వానిఁ బ్రకటించువార లేని
వారిఁగాక మన్నమస్కృతు లేఁ జెంచు.

బోడపాటి శివరామకవి,
రాజమహేంద్రము.

రజతోత్సవపద్యములు.

(1) దివాకర్ల వేంకటావధానిగారు.

ఉ. ఈ రజతోత్సవమ్ము నొనరించుట సత్పరిషద్విలాసవి
స్తారయశోవిభూతుల కజస్రము కారకుఁ డైనవాని వి
ద్యారతు సత్తమోత్తము జయంతికులీనుని రామయార్యు నిం
పారఁగ గారవించు టని భావమునం దలపోయుటొప్పదే ?

సీ. ఆంగ్లభాషాపార మరసి యుద్యోగియై
యధికృతిమన్నన లందినాఁడు
ఆంధ్రగీర్వాణమ్ములందు సప్రతిమాన
మైన సంస్కారము నూనినాఁడు
రసవత్ప్రబంధనిర్మాణచాతురిఁ జూపి
కవిలోకవిఖ్యాతిఁ గాంచినాఁడు
స్వార్థమ్ము వీడి భాషాదేవిసేవయే
పరమార్థ మనుతలం పరసినాఁడు
అఖిలసమ్మత మైన విన్యాస మొప్ప
నాంధ్రసాహిత్యపరిషజ్జాయతోక్తి
యితని సంతతకృషిచేత నింతవఱకు
సరసికొనఁజాలె దైనందినాభివృద్ధి.

ఉ. శ్రేయము గల్గుకార్యములఁ జేయఁగ లేచు స్వయమ్ముగాఁగ భా
నాయకు లెవ్వ రెంత సుగుణప్రియులైనను వారి నెవ్వరో
సాయము గా భవాదృశులు చక్కని ఫక్కికి దాపుముందు రో
ధీయుత ! నిన్నుఁ బోలఁగలధీరులు దుర్లభు లీజగమ్మునన్.

మ. కవి విద్వాంసుఁడు కావ్యవేత్త విపులక్ష్మాపాలుఁ డుద్వేలభా
గ్యవిలాసుండు వదాన్యమౌళి వినయవ్యాపారుఁ డుద్యద్యశ
స్తవనీయుండగు విక్రమోర్వీపతి యభ్యర్హత్వముం గాంచు టొ
క్క విశేషంబని నమ్ము మమ్మ ! పరిషత్కల్యాణి ! నిక్కమ్ముగన్.

ఉ. రాజుల చేతి బిడ్డవయి రాణ వహించుచు నుంటఁ జేసి వి
భ్రాజదనంతభోగములఁ బొల్పడియుం బ్రతివత్సరంబు నీ
వోజనయిత్రి! యాశ్రితుల నొక్కొకమండల మేఁగి చూచి త
త్పూజలఁ గాంచు నోపికయుఁ బూనికయు న్నుతియింపఁ జెల్లదే.

ఉ. అందని ప్రామాణికంపు లగునట్టి కళానిధులు న్గవీంద్రసం
క్రందను లొక్కచో నలరఁగాఁ దిలకించి తదీయ వాక్సుధా
స్యందము గ్రోలు భాగ్య మనయంబు భవత్కృపఁ జేసి కల్గె నా
నందముతో నొనర్చెదఁ బ్రణామముల న్గయికొమ్ము తల్లిరో!

సీ. పలువిధంబులఁ బోవు భాషాకుమారుల
నేకసర్గులను గావించుటొకటి
యన్యభాషలయందు నలరు శాస్త్రావళి
నెలమిమై నాంధ్రీకరించు టొకటి
కాలాను గుణముగాఁ గలుగు మార్పుల సైఁచి
యితరదేశ్యముల చోటిచ్చుటొకటి
సహవాసజనితదోషముచేత మనభాష
పాడుగాకుండఁ గాపాడు టొకటి
చేయఁదగ్గపనులు చింతించి నెఱవేర్పు
మాంధ్రమందు లోప మసమ గాఁగ
చిరమునుండి వచ్చు గురుయశస్సంపత్తి
నాంధ్రపరిషదంబ! యాఁపు కొనుము.

క. నీవు జనించిన దాదిగ
భావుక మగురీతి నిన్నుఁ బాలించిన సూ
ర్యావనిపాలుఁ డితోఽధిక
జీవనసౌభాగ్యసిద్ధిఁ జెంది సుఖించున్.

చ. జయపుర మేలుచుండిన విశాంపతికిన్ బునరుక్తిగాఁగ నే
జయమని పల్కు టేల? పరిషల్లలితాంగి యుదారుఁడైన భూ
దయితుని యాదరంబునకుఁ దద్దయుఁ బాత్రమవై సుఖంపు మా
శయముల సిద్ధి గాంచుత మజస్రము వాణి దయార్ద్రదృష్టిచే.

---

(2) తాడిమళ్ల నారాయణమూర్తిగారు, ఎం. ఏ.

గీ. రాజకవియొప్పారఁ బండితరాజసభల
గౌరవించి సన్మానించు ఘనత పేర్చి
నాంధ్రభాషాభివర్ధనుం డల్ల కృష్ణ
దేవరాయలె విక్రమదేవవర్మ.

గీ. అష్టదిశలందు దిగ్విజయంబు గలిగి
నాఁటి సత్కవు లష్టసంఖ్యాకులైన
నేఁటి సత్కవీశ్వరు లసంఖ్యేయులైరి
నాఁటికంటె నేఁడే సద్గుణాధికంబు.

గీ. సంస్కృతాంధ్రభాషల సలసానిపెద్ద
నార్యుఁడు ప్రసిద్ధిఁ జెందె జయంతి రామ
యాఖ్యపండితవర్యుఁడు నాంగ్లభాష
నధికప్రఖ్యాతిఁ గాంచెఁ బ్రజ్ఞానిరూఢి.

సీ. శ్రీమహాలక్ష్మి విశేషభాగ్య మొసంగు
బ్రహ్మ చిరాయుసంపద ఘటించు
జయము యత్నములందు సర్వేశ్వరుం డిచ్చు
భాస్కరుం డారోగ్యభాగ్య మిచ్చు
యంత్రమువోలె దేహము పనిచేయుత
మెల్లవిద్యల వాణి కిల్లువలెనె
తిరముగఁ గీర్తి సిద్ధించెను రవిచంద్ర
తారకముగనె విద్వత్ప్రసక్తి
రామభక్తిని జాటురామచరిత్రోక్తి
యాంధ్రగీర్వాణభాషాభిలాష
మఱపు రానీయను మనమున రాజకీ
యోద్యోగమహిమ మత్యుత్సుకతను
యమనియమాదుల నాయురారోగ్యముల్
ప్రకటించు దీక్షాప్రవర్తనంబు

పండితసన్మానభావ మీసభ దెల్పు
మహిమంబు జనులసమ్మతమె దెలుపు
తునిమె గ్రామ్యవాదమును దుత్తునియలుగ వె
లుంగు నిపుణత ధర్మసత్సంగతులను
గారవమునకు నెల్లెడ మేఁగలేకు
రుచిరగుణకీర్తి రామయామాత్యుండువఱలు.

చ. సరసకవిత్వవైఖరిని శాస్త్రసమన్వితభక్తి సత్కవీ
శ్వరులు రచించుగ్రంథములు శాశ్వతకీర్తియుతంబులై ధరన్
స్థిరపఱుప న్నిఘంటువు రచించి ప్రసిద్ధి వహించుచుండఁగా
నిరువదియైదువత్సరము లీపరిషత్తువయస్సు నేఁటికిన్.

గీ. ఇట్టి సిల్వరుజూబిలీ లెన్న లేని
సార్లు వచ్చుచుండవలె భాషావధూటి
శాస్త్రసమ్మతమూచు సజ్జనులహృదయ
రంజకమయి వర్ధిలు నిరంతరంబు.

---

(3) కొమరవోలు వేంకటసుబ్బరావుగారు బి. ఏ.

శా. రారాపిల్లకు నోర్చి విత్తజలధారాపూరముల్ సేర్చి మో
కీసుం గడియుఁ గూర్చి సేద్యమును దానేనాఁట నీసీమలోఁ
బ్రారంభించె జయంతి రాముఁడను పూర్ణప్రజ్ఞుఁ డౌరైతు, సూ
ర్యారాయుం డటమీఁద సాకె ఫల మధ్యక్షింపుఁడీ ధీవరుల్.

చ. ఇరువదియైదువత్సరములేఁగెఁ గృషీవలసత్తముండు జ
ర్జరితవయస్కుఁడయ్యె సుకసత్ఫలమోదమనస్కులౌచు నె
ల్లరు శుభకాంక్షలం గృషిఫలమ్ముల ప్రాప్తికి వేచియుండఁగా
సురపడితోడఁ గూడె రజతోత్సవవేళలు విస్మయంబుగన్.

సీ. చెదపుర్వునోటిలోఁ జెఱవడ్డవాఙ్మయ
మ్మున కెల్లొ చిరకాల ముక్తిగలిగె

శైథిల్యమునఁగూలి సమయు పూర్వప్రబం
ధములకు సుస్థిరత్వంబుకలిగె
వ్యవహారభాషామహాఘాటికోచ్చ గ్రాం
థికభాష ప్రౌఢిమఁదేటివిలిచె
భావకవిత్వాది వాంతికోగములను
బరిమార్చు సౌషధవల్లి యచ్చె
నేమహాసంస్థదీక్షనోద్ధానమహిమ
విపుల కీర్తిప్రసూనముల్ విరియు నట్టి
యాంధ్రసాహిత్యపరిషన్మహాప్రసిద్ధ
సభకు రజతోత్సవము నేఁడు జగతి వినుము.

గీ. భారతీతీర్థకరిమత్సభాశ్రయుక్త
సరససాహిత్యసామ్రాట్ప్రశస్తబిరుద
ఘనుఁడు జయపురాధిపుఁడు విక్రమనరేంద్రుఁ
డాసభాధ్యక్షుఁడట్టి భాగ్యం బదేమొ.

మ. దినవాథప్రతిమానకోవిదుఁడు జ్యోతిశ్శాస్త్రపారంగతుం
డును నా విక్రమభూపు కీర్తిసతి గండూషించె దిఙ్మండలం
బునుదన్నన్గొనఁగేమి సత్యమె యగు న్బాగ్యైక్యకో లభ్యతే
యని గాదా వచియించు ముండెదను సత్యాభిజ్ఞశాస్త్రీయుతుల్.

సీ. బహుళభాషాగళగ్రహపాండితిమండి
తత్రజ్ఞ తనకు బాంధవుఁడుగాఁగ
గీతారహస్యవిదీర్ణతిసితివిధాన
చర్యయే తనకు దర్శకుఁడుగాఁగ
తతవసీవకదరిద్రాణదుఃఖత్రాణ
హస్తమ్మె తనకు విద్యుమ్ముగాఁగ
దశదిశావిశ్రాంత విశదయశఃపూర
పటలంబె తనకు దీపంబుగాఁగ

రాజ్య భోగాలఁ దేలు నీరాజమూర్తి
యయ్యు నధికారవైయాత్య మభిగణింపఁ
డొల్లఁ డాడంబరము నోర్తి నుజ్జగింపఁ
డహహా ! సామాన్యుఁడే విక్రమాధిపుఁడు ?

సీ. కవిసార్వభౌమసంగ్రథితకావ్యములకుఁ
కృతిభర్త యితఁ డన్న నుతికిఁ దెరువు
రసవత్ప్రబంధముల్ రచియించు నితఁడంచు
వచియించు దడి వందివాక్యసరణి
లక్షలాదిగ విరాళము లిచ్చు నితఁ డంచుఁ
గొనియాడు టది మెచ్చుకోలుమాట
యతులవైభవసముద్ధతుఁడయ్యు నాడంబ
రవిహీనుఁడనుట కీర్తనకుఁ జొప్పు
వరుస కొక్కఁకి నొప్పిక మరసి చూడ
నన్నిగుణములు నీయందు సార్థకములు
ప్రాక్తనాచారనియతవర్తనుఁడ వీవు
కలరె నీవంటి నృపులు విక్రమనరేంద్ర ?

చ. బుధులను సత్కవీంద్రులను భూపతులన్వలకట్టుచుంద్రు ద
త్తధనకమప్రకర్షణవిధానమునన్ హితబృందవందిమా
గధనుతుఁడైన భూభుజు ముఖప్రసుతవాక్యమొకండె కోటి క
త్యధికము సేయు నంచెఱుఁగ కయ్యెరొ యొంతటియల్లులో కదే.

సీ. రాజరాజనరేంద్రరత్నరాజకిరీట
దివ్యదీధితులలోఁ దేలివచ్చి
రెడ్డిరాజన్యుల రొడ్డోలగంబున
సరససాహిత్యసౌష్ఠవముఁ బడసి
కృష్ణరాయలదివ్యకీర్తిసుధాశర
చ్చంద్రికాతతుల నైశ్వర్య మొనసి

భరతశాస్త్రప్రౌఢపరిణేతరఘునాథ
నరనాథు కడ కళాభిరతి నెఱపి
వార్ధకముతోడ ముదిరి చేవను దలిర్చు
నీమరసికత శేముషీవిరతి దాన
శీలసంపత్తులను బరీక్షింపఁగోరి
కడకు నినుఁ జేరె నాంధ్ర విక్రమనరేంద్ర.

సీ. పరితృప్తులనె తృప్తిపఱచె నీతండన్నఁ
బరుల సంగతులఁ జెప్పఁగ నేల
యంతర్విరోధుల నణఁచె నీతండన్న
బాహ్యశత్రులఁ గూర్చి పలుక నేల
గవిభూషణులె పడిగాపు లీతని కన్న
నితరుల చందమ్ము లెంచ నేల
వైరాగ్యశిష్టజీవనవర్తి యితఁడన్న
నిహపరాఙ్ముఖభావ మెన్న నేల
యనుచు జగమెల్లఁ గీర్తింపఁ దనరుపట్టి
జయపురాధీశ శ్రీకృష్ణచంద్రపుత్ర,
జరతపార్థివమాని మాసభను నడప
నేఁగుదెంచితె కొమ్ము మా యేటికోళ్లు.

గీ. అనఘ ప్రత్యూష మనెడు కావ్యము గ్రహించి
నన్ను దయఁజూచి నాఁడవు మున్నటులనె
యందఱకు నీవు కారుణ్య మబ్బునట్టు
లాయురారోగ్యములు నీకు నభవుఁ డిడుత.

ఆంధ్రవ్యాకరణము.

చర్ల నారాయణశాస్త్రిగారు—పిఠాపురము.

సృష్టికిని దన్నియమసూత్రములకును నెట్టి యవినాభావసంబంధ మున్నదో యట్టియవినాభావసంబంధమే వాఙ్మయమునకును వ్యాకరణమునకును గలదు. భాష ప్రవాహరూప మైనది. వఱదలు వచ్చి ప్రవాహము గట్లుదాఁటి పోవునపుడు దానిని నియమింపఁగ నవసర మైనట్లే భాషకూడఁ బామరవ్యవహృతమై నిరంకుశముగా వ్యవహరింపఁబడినపుడు దానికిఁ గూడ నియమ మావశ్యక మగుచున్నది. కాని కాలక్రమమున నొకటఁ జేయఁబడిన నియమములు వాడితవ్యవహారమున సడలింపఁబడుట సంప్రదాయ మైనది. అట్లు కాలక్రమమున నియమములు సడలింపఁబడి దేశకాలపాత్రములఁబట్టి మార్పు చెందుట యవసరము కూడ నైనది. కనుకనే సంస్కృతభాషలోఁ బాణిని, వరరుచి, పతంజలులు, ఒకరి తరువాత నొకరు వారివారికాలములందుఁ బ్రసిద్ధములైన రూపములను వార్త్తికములచేతను, ఇష్టులచేతను సాధించుచు మిగిలినవానిని గణములయందును సార్థక్యకల్పనములయందు నంతర్భవింపఁ జేయుచు వచ్చిరి. తరువాతిమహాకవుల ప్రయోగములు కొన్నిటి కింకను సాధుకల్పన మేర్పడనేలేదు. ఇతరభాషలయందుఁ గూడ దేశకాలాదులనుబట్టి వ్యాకరణములు మాఱుచు వచ్చిన వనుసంగతి మనీషులకుఁ దెలియనిది కాదు. ఒక్క వ్యాకరణములలో మాత్రమే కాదు. ఆచారవ్యవహారములలోఁ గూడ మార్పు గలుగుచున్నది. పూర్వాచారము లగు దేవరన్యాయము, సహగమనము, నిప్పుడు లేవు. కనుక జీవద్వాఙ్మయములలోని వ్యాకరణములకు మార్పు తప్పదు. అదిగాక జీవద్భాషల వ్యాకరణములకు సంపూర్ణత కూడ నుండుట యసంభవము. ఎప్పటి కప్పుడు వైయాకరణులు మహాకవిప్రయోగములను బట్టి వారివారికాలములలో మార్పు గావించుకొనవలసి యున్నది. దీనినే "సిద్ధి ర్లోకా ద్ధృశ్యా" ప్రయో

గమూలం వ్యాకరణం,అనుభూక్తులు స్పష్టపఱచుచున్నవి. ఇట్టిమార్పులు కాలక్రమమున నెట్లు వచ్చెనో ముందు చూపెదను.

ప్రస్తుతము మనవ్యాకరణములలోఁ బరస్పర మెట్టిభిన్నాభిప్రాయములు సంభవించినవో ముందు తెలిసికొనవలసి యున్నది.

ఆంధ్రశబ్దచింతామణి:—ఆంధ్రవాఙ్మయము మాంధ్రమహాభారతములోఁ బ్రారంభ మైనది. నన్నెచోడుని కుమారసంభవము భారతమునకుఁ బూర్వమే రచింపఁబడె ననువాదము లేకపోలేదు. కాని యీవిషయ మింకను బ్రస్తుత మగుటచే దానిసంగతి వదలిపెట్టుచున్నాను. ఆంధ్రవ్యాకరణములలో "ఆంధ్రశబ్దచింతామణి" యొకటి యనుసంగతి నిర్వివాదము. నన్నపార్యుఁడు తనభారతములోఁ దా నవలంబించిన కొన్నిసామాన్యనియమముల, నాకాలపుసంప్రదాయముల నందుఁ దెలిపియున్నాఁడు. ఈయాంధ్రశబ్దచింతామణి రచనమువలననే యితనికి వాగనుశాసనుఁడను బిరుదము వచ్చినట్లు పండితులకు విశదమే.

ఆంధ్రశబ్దచింతామణి నన్నయరచితము గాదను శ్రీ వీరేశలింగము పంతులుగారివాదము సరియైనది కాదని యిటీవలనే నిశ్చయింపఁబడినది. కేతన తనయాంధ్రభాషాభూషణములో "ముద్దు దెఱఁగుపడు లక్షణ మెన్నఁడు నెవ్వరును జెప్ప రేఁ జెప్పెద" నని చెప్పికొనియున్నాఁడు. కాని యితనికాలమున నాంధ్రశబ్దచింతామణి కంతప్రచారము లేకపోవుటచేఁ గేతన యట్లు వ్రాసియుండును.

చింతామణివ్యాఖ్యలు:—ఆంధ్రశబ్దచింతామణిని బ్రచారములోనికిఁ దీసికొనివచ్చినవాఁడు- ఎలకూచి బాలసరస్వతి. బాలసరస్వతి చింతామణికి భాష్యము వ్రాసియున్నాఁడు. అది బాలసరస్వతీయ మను పేరితో నున్నది. మొన్ననే యీ యాంధ్రసాహిత్యపరిషత్తువారు దానిని బ్రకటించిరి. ఈచింతామణికే అప్పకవి సోదాహరణముగా నొక విపులవ్యాఖ్య వ్రాయఁ దలఁచెను. కాని కొలఁదిభాగమునకే వ్యాఖ్య వ్రాయఁగలిగెను. మొత్తముమీఁద నది ఛందోవిషయకముగానే యెక్కువగానుండుటచే దానికి ఛందోగ్రంథముగా వ్యవహారము గలిగినది.

అతనిపుస్తకమునకు బాలసరస్వతిగ్రంథమునకుఁ బాఠభేదము లనేకము లు గనుపట్టుచున్నవి. వానియుక్తాయుక్తతలను నేను వ్రాసిన బాల సరస్వతీయపీఠికలో వివరించియుంటిని. బాలసరస్వతీయమునుపిదపఁ జెప్ప దగినది యహోబలపండితీయము. బాలసరస్వతి వ్రాసినటీక సంగ్రహ ముగా నున్నది. అది చాలవఱకు నిర్దుష్టముగా నున్నది. తనటీకలో బా లసరస్వతి నన్నయసంప్రదాయములను జక్కఁగా సరిగాఁ దెలిపియున్నాఁ డు. ఈబాలసరస్వతిపాఠము నతనిటీకను, ఆధారముగఁ జేసికొని యహో బలపండితుఁడు చింతామణికి విపుల మగు వ్యాఖ్యానము వ్రాసెను.

అహోబలపండితుఁడు చింతామణివ్యాఖ్యలోఁ దచ్ఛేషపూరక మగునథర్వణునివికృతివివేకమును జేరిచి రెండిటికిని సమన్వయము చేసె ను. అథర్వణునికారికల కితఁడు వ్రాసినటీక చాల ముఖ్యమైనది. ఇతఁడు వ్రాయఁగా మిగిలినకారికలలోఁ గొన్నింటి కిప్పటికిని సరియైనయర్థము లభించుట లేదు.

కవిజనాంజన మనువ్యాఖ్యకూడఁ జింతామణికిఁ గలదు. ఇందు లో నహోబలపండితీయములోని యుదాహరణములే తఱచు కన్పట్టు చున్నవి. ఇందులో నంతయెక్కువ విశేష మేమియునుఁ గానరాదు. కాని యహోబలపండితీయములో లేని కొన్నియథర్వణకారిక లిందుఁ గలవు.

— నన్నయకాలమునఁ గలసంప్రదాయములు —

నన్నయకాలమునకు దేశభాషాకావ్యములం దాసక్తి గలిగినట్లు "స్వస్థానవేష భాషాభిమతాః" అను చింతామణిశ్లోకము విశదపఱచుచు న్నది. శబ్దానుశాసనుఁడు రససిద్ధికే ప్రాధాన్యము నిచ్చియున్నాఁడు.

గ్రామ్యము.

నన్నయ, పదసిద్ధి లోకమువలనఁ దెలియనగు ననియు లోకమన న్యాదృశము నిత్యము ననియుఁ జెప్పి నియమావశ్యకతను గూర్చి ప్రసం గించును. "అనియమా ద్గ్రామ్యం హి య త్త్వపభ్రంశః" అను సూక్తి వలన నన్నయకాలమునకే కటిగల్లాద్యర్థవిషయక మగుగ్రామ్యపదము నియమరహిత మైనపదముల విషయమున నుపయోగింపఁబడిన దని

తెలియుచున్నది. నియమరహితముగా వాడఁబడిన పదము గ్రామ్యమనునన్నయభట్టారకుని యుద్దేశము తరువాతి వైయాకరణులలో "లక్షణవిరుద్ధం బగుభాష గ్రామ్యంబు" అను నభిప్రాయములోనికి మాఱినది. దీనినిబట్టి ప్రాచీనలక్ష్యసంప్రదాయనియమవిరుద్ధ మగుభాష గ్రామ్యమనుశబ్దానుశాసనాశయము విభిన్నమై పోయినది.

వర్ణోచ్చారణము.

వాగనుశాసనుఁడు వర్ణోచ్చారణవిషయమున నప్పటివాడుకను గొంత విశదపఱచి యున్నాఁడు. ఇప్పటినవీన వైయాకరణులు సంధిలేని చోట యడాగమమును విధించియున్నారు. కాని నన్నయమాత్ర మట్లు చెప్పియుండలేదు. "అచ్చుపై నున్న యచ్చు యశ్రుతిఁ బొందు ననియు నది లఘు" వనియు నతనికాలపువాడుక తెలిపియున్నాఁడు. అథర్వణుని నాఁటికే యీయభిప్రాయము మాఱినట్లు "ప్రాణా త్ప్రాణో లఘు ర్య స్స్యాత్ సహల్స్యాచ్చ భవేత్ క్వచిత్" అను నతనికారిక స్పష్టపఱచుచున్నది. దీనినిబట్టియే చిన్నయసూరిప్రభృతులు "సంధిలేనిచోట స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమం బగు" నని సూత్రించి "హరియతఁడు- ఇత్యాదులం దాగమయకారము లఘువు- తక్కినయకారమలఘువు" అని వివరించినారు. కనుకనే నేఁటిపూర్వసంప్రదాయము తెలియకుండనే పోయినది.

నన్నయభట్టు వర్ణోచ్చారణమున సందిగ్ధస్థలములను గొన్నిటిని జూపి యచ్చట భ్రాంతిని నివారింపఁజేయుచు నెచ్చట నెట్లుచ్చరింపఁదగునో తెలిపియున్నాఁడు. భూతార్థక పదములందును శబ్దాదియందును దక్కఁ దక్కినచోట్ల నున్న యకారము అత్వముతో నుండు ననియుఁ బైవానియందలి యకారములు మాత్రము ఎత్వయుతము లనియుఁ జెప్పియున్నాఁడు. ఇట్లే దంత్యతాలవ్యచజలవిషయమునను సందేహనివారణార్థము చెప్పియున్నాఁడు. ఇచ్చట నథర్వణుఁడు-

"భావిక్రియాసు యస్య స్యా దేత్వ మేవ ప్రయోగతః
డుడ్వాదివర్ణే భూతార్థే చాపి తద్వద్భవే త్సతా
డ్వోలాభూషో త్తరీయాణి వినైత్వం నాస్తిమధ్యయః"

అని రెత్వ మెచ్చుచెప్పుట నుండునో పరిగణనము చేసి చెప్పియున్నాఁడు. దీనిని జూచి బాలవ్యాకరణకర్త "ఊమేల వమ్యొద తావొతులం ద్రిక్క నామంబులందు యూతుం దాలవ్యవక్రయోగంబు లేదు." అని చెప్పిరు. ఆంధ్రకౌముదిలోఁ గూడ నీమార్గమే త్రొక్కఁబడినది. దంత్యతాలవ్యచజలవిషయమునఁ గూడ నథర్వణుఁడు చేసిన పరిగణనమును జిన్నయసూరి యనుసరించినాఁడు. ఇందు నన్నయ చూపినసంప్రదాయము సంగతి వేఱు, అథర్వణాదులు చూపినసంగతి వేఱు నగుచున్నది. నన్నయభట్టాదియందు యశ్రుతి నంగీకరించియున్నను శ్రుతిసంగతి తలపెట్టక "ఆద్యవర్ణాస్తు హ త్వేన గృహ్యన్తే న కదాపి చ" అని యాదియందు యకార ముండనేయుండ దని యథర్వణాచార్యులు చెప్పెను.

ద్రుతాంతములు:—ద్రుతమువిషయములో ననేకములగు నభిప్రాయములు కలవు. మొదట వాగనుశాసనుఁడు "ద్రుతాత్ప్యో నః" అని సామాన్యముగాఁ జెప్పియున్నాఁడు. అథర్వణుఁ డాద్రుతస్వరూపమును వివరించి నొకచోటను జెప్పియుండలేదు. కాని ద్రుతకార్యములను స్వత్వబిందుసంశ్లేషములుగాఁ దెలిపియున్నాఁడు. తట్టీకాకారు లగు బాలసరస్వత్యహోబలపండితులు స్వత్వాదిద్రుతకార్యములనే కాని ద్రుతము ప్రత్యయాగమాద్యయాత్మక మని కాని ప్రకృతిస్థనకారము ద్రుత మని కాని చెప్పలేదు. చిన్నయసూరికూడ ద్రుతవిషయము నెత్తుకొనలేదు, కాని, ద్రుతకార్యముగా "కను + దోయి" కందోయి, అనునుదాహరణ మిచ్చుటచేఁ బ్రకృతిస్థ నకారముగూడ ద్రుతముగా నతఁ డంగీకరించినట్లు తెలియుచున్నది. బహుజనపల్లి సీతారామాచార్యులుగారు మాత్రము "నకారం బసాధారణంబు ద్రుతంబు" అని సూత్రించి "ప్రత్యయాగమాద్యయాత్మక మై యుత్వవిశిష్ట మైన నకారంబు ద్రుతసంజ్ఞకం" బని వివరించి ప్రకృత్యవయవనకారంబు ద్రుతముకా దనునభిప్రాయము వెల్లడించియుండిరి. కాని "కందోయి, పెన్జీఁకటి, వెంబడి, ఎందేడెందము, రామునే సీతనేఁ గొలిచెద" ఇత్యాదులఁబట్టి సీతారామాచార్యులుగారి

నిర్వచనము సంకుచిత మయ్యె నని చెప్పవలసివచ్చుచున్నది. కనుకనే ప్రథమాచార్యుఁడు "ప్లుతాభ్యో నః" అని సామాన్యముగా సూత్రించియున్నాఁడు.

తద్ధర్మసంధి:—తద్ధర్మక్రియలకును తద్విశేషణములకును సంధి రాకుండుటకై "న స్యాత్ తద్ధర్మోక్తేః" అని నన్నయభట్టు సూత్రించియుండెను. ఇక్కడ నొకసందేహము గలుగుచున్నది. వాగనుశాసనుఁడు తద్ధర్మములను ప్లుతాంతములుగా గ్రహించియుండెనా లేక కళలుగా గ్రహించి యుండెనా? అని. ఇతఁడు కళాపరిగణనములోఁ దిఙ్మధ్యములను మాత్రమే, అనఁగాఁ, గ్రియలలో రమాంతక్రియలను మాత్రమే కళలుఁగాఁ జెప్పెను. ఇందువలనఁ దద్భిన్నము లగుతద్ధర్మక్రియలు ప్లుతాంతము లని చెప్పవలయును. తద్ధర్మక్రియలతో పాటు తద్ధర్మవిశేషణములను గ్రహింపవలయును. ఇక్కడ "వచ్చున్ + ఇతఁడు" ఇత్యాదులలో ప్లుతవ్యవధానముచే సంధియే వచ్చుటలేదు. కాని తద్ధర్మసంధినిషేధమువలననే ప్లుతవ్యవధాన మున్నను సంధిరావచ్చు నని నన్నయ యాశయముగాఁ దెలిసికొనవలసియున్నది. కనుకనే "అనాదిషు విభక్తిషూకో వా" అను విధి సార్థక మగుచున్నది. నన్నయయొక్క యభిప్రాయమునే-

'అచాం సంధౌ ప్లుతోఽకృత్యస్థితోఽపిచ భవేత్సదా'

అను నథర్వణకారిక వివరించుచున్నది. తద్ధర్మక్రియలు తద్విశేషణములు ప్లుతాంతము లనునన్న యాభిప్రాయమునే యథర్వణాచార్యుఁడు

"ప్రథమ శ్చోత్తమ శ్చైవ తాసు తద్ధర్మసంజ్ఞికౌ,
భూతాద్యవిషయౌ, తత్ర చైక త్వార్థాభిధాయకౌ,
ఉదంతౌ చ సదా నాంతౌ నసంధి స్తత్రకల్ప్యతే."

అని స్పష్టముగాఁ జెప్పినాఁడు. ఆధునికుఁ డగుచిన్నయసూరి మాత్రము తద్ధర్మవిశేషణములను కళలు గానే యంగీకరించి వానికి నుగాగమమును విధించియున్నాఁడు ప్రక్రియానిరూపణములో నింకు దోషము లేకున్నను సంప్రదాయము భేదించినది. లేక చిన్నయసూరి 'న స్యాత్ తద్ధర్మోక్తేః' అనుసూత్రమునకు 'తద్ధర్మోక్త్యమునకు నకారము వచ్చును'

అనుసర్థ మని భ్రాంతిపడె నేమో యని మనము సందేహింపవలసి వచ్చుచున్నది. చిన్నయసూరి ఆంధ్రశబ్దానుశాసనములోఁ గూడ నుగాగమ విధియే కన్పట్టుచున్నది. 'నస్యాత్తద్ధర్మో తః' అనుదానిలో బాలసరస్వత్యహోబలపండితులు 'న' అనుదానిని నిషేధార్థకముగనే వచించియుండిరి. అథర్వణాచార్యుఁడు 'న సన్ధి స్తత్రకల్ప్యతే' అని స్పష్టముగా సంధ్యభావమునే చెప్పియున్నాఁడు. ఇాదర్థము చేసికొనుటలోఁ జిన్నయసూరి ప్రమాదపడె నేమో యనవలసివచ్చుచున్నది. అతఁడు 'న స్యాత్ తద్ధర్మో తః' అనుచోట రెండు నకారము లున్న వని యనుకొనెనేమో. బాలసరస్వత్యాదులటీక గాని, యథర్వణుని వచనముగాని యితఁడు చూడలేదా? లేక చూచినను మఱచియుండెనా? అనుసందేహము గలుగుచున్నది.

డుప్రత్యయాది విధానము:- నన్నయభట్టారకుఁడు మొదటి నుండియు సంస్కృతవ్యాకరణపద్ధతినే తనవ్యాకరణమును రచించియున్నాఁడనుసంగతి యందఱకును దెలిసినదే. అతఁడు సామాన్యముగ సంస్కృతవిభక్తిప్రత్యయములే తెలుఁగుప్రాతిపదికములకంటె నగునను నభిప్రాయముతో 'సు ఔ జస్' ఇత్యాదిసంస్కృతప్రత్యయములకు డుప్రభృతి ప్రత్యయముల నాదేశముగాఁ జెప్పియున్నాఁడు కాని యాధునికు లగు చిన్నయసూరి మొదలగువా రట్లు విధింపక మొదటనే మహదాదులకు డ్వాదిప్రత్యయములను విధించి యున్నారు. ఆధునికులరచనలోఁ గొన్ని చోట్ల దోషము సంభవింపక తప్పినది కాదు. చిన్నయసూరి "స్త్రీలింగంబులప్రథమైకవచనంబునకు లోపం బగు" ననియు ను "ప్రథమైకవచనంబునకు లోపం బగు" ననియును ప్రథమైకవచనంబునకు లోపము చెప్పియున్నాఁడు. కాని 'డు, 'ము' ప్రభృతివర్ణకంబులు మహదర్థకములకంటెను, అమహన్నపుంసకలింగములకంటెను విశేషముగా విధించి యుండుటచే ఇకారాంతములకంటెను, స్త్రీలింగములకంటెను, ప్రథమైకవచన ప్రత్యయములు లేవు. స్థాని యున్నఁ గదా లోపాదేశము విధించుటకు. వాగనుశాసనుల రచనములో సామాన్యముగా విభక్తులు విధింపఁబడుటచే వానికి లోపాదివిధానము సమంజసమే యగుచున్నది.

ఇట్టి వింక నాధునికుల రచనములలోఁ గన్పించుచున్నవి. విస్తర భీతిచే సామాన్యము లగువిషయములను గొన్నిటి మాత్రమే చూపియుంటిని. కాలక్రమమున మనవ్యాకరణములలోఁ గలిగిన మూఁడునాలుగు సామాన్యమగు మార్పులు చూపెదను.

వాగనుశాసనులు ద్రుతప్రకృతికముల కచ్చుపరమగునపుడు లుక్సంశ్లేషములు రావని "ద్రుతప్రకృతికేభ్యో లుక్సంశ్లేషౌ నాచి'' అను సూత్రముచే నిషేధించియున్నారు. 'అన్నిష్టసఖ నూఁదియున్న దాని' భార. ఆది. 8. అ. అనుప్రయోగము ద్రుతసంశ్లేషరూప మని చెప్పరాదు. 'అను' అనుక్రియాజనిశేషణములోనిలుప్తశేషమగుప్రకృత్యవయవనకారము ద్రుతముకాదు. ద్రుతమైనచో 'గిరివ్రజమున్నపురంబు' ఇత్యాదుల 'గిరివ్రజ మన్పురంబు' అని రూపభేదము గలుగవలసివచ్చును. "అన్నిష్టసఖ"పెను+ఉద్ది=పెన్నుద్ది. పెన్నాఁత, అన్నర్వేసుఁడు, మొదలగురూపములవంటివి నకారద్విత్వము వచ్చినరూపములు" మదీయభాషిత మెన్నఁడు, న్నేని మోఘము గాదు దిగ్గరణీకపింపు లెఱుంగఁగాన్. భార. ఆది. ౭-౧౭౧ అనుచో వనిరూపాంతర మగు "నేని" అనునది గాని "వని" అని కాదు. కాన నిదిగూడ ద్రుతసంశ్లేషరూపము గాదు. నీవును జూచి తట్టిసభ నేని వినంబడ దేయుగంబులన్. భార. సభా. ౩. ౬౧. అను నన్నయార్యనిప్రయోగము "నేని" అనురూపాంతరములోఁ బ్రమాణ మగుచున్నది. 'నేని' యనుటకు నన్నయేతరకవి ప్రమాణములు కూడ నున్నవి. చందనంబు లడియూఁటను నేనియు నంగజన్న. కు. సం. ౧౧౧. అదిగర్భశ్వరి నంటినఁ గందెదు నెలకన్నెఱుఁగవు నేని... కు. సం. ౬. ౬౭౦ అని. ఇట్లునన్నయకాలమున ద్రుతసంశ్లేషము సమ్మతము గాలేదు. ద్రుతసంశ్లేషమథర్వణునికాలమునను దరువాతను వాడఁబడి సాధు వయినది. అథర్వణుఁడు "నో వా ద్విత్వం క్వచి ద్దృష్టం పరప్రాణేవ సంగతేః'' అని దానికి సాధుత్వము తెలిపియున్నాఁడు. 'ఘనచక్రాయుధనిష్ఠురక్షతగళద్రక్తాస్యసర్వాంగుని, న్ననుభూతాప్రతిమప్రగల్భ పరివాదాంతర్హితోద్వక్రముగ్. ఉ. హరి. 'కడఁతులమీఁద నేయ రతివయ్యెదకున్ననుపైనచే

తులన్. మనుచ. 3. ఇత్యాదిప్రయోగములు కాలక్రమమున సాధువులైనవి. ఆంధ్రశబ్దచింతామణిలో 'పవికృతిశబ్దా త్వరతః సాంస్కృతికానాం భవంతి గసడదవాః' అని తెలుఁగుఁ బదములయాఁది సంస్కృతపదాదిగత కచటతపలకు గసడదవలు నిషేధింపఁబడినవి. కాని యావిధి తరువాత సాధువైపోయినది. అథర్వణుఁడు సామాన్యముగాఁ బై విధిని జెప్పియున్నాఁడు.

“వికృతాః పరుషాశ్చ స్యు స్సువ ఆద్యపదాదిగాః, అని “ప్రి, ర లోపించిన నంతకుంతు చెదు.” ఉ. హరి. ౮. “ఎవ్వంతు వరించెదు వాఁడు- కాశీఖండము. 'వేపణములు' (పణములు) విజ్ఞా. ప్రా. 'పెంపువరీక్షింపమొ' వసు. 3. ఇత్యాదులు పై యథర్వణసూత్రివలన సాధువగుచున్నవి.

'అఖిలమునకు' ఇత్యాది నగాగమసహిత రూపములు 'నః కౌ' అను నన్నయసూత్రముచే సాధింపఁబడినవి. అవి తరువాత మాఱినవి.

'నః ప్రాయ స్స్యాత్' అని యథర్వణుఁడు దానికిఁ బ్రాయికత్వమును విధించి యుండెను. 'అఖిలమునకున్' అని, ఉత్తరహరివంశములోఁ గలదు. 'విక్రమమునకు' అని నిర్వచనోత్తరరామాయణము. ౭. ఆశ్వా. 'బచ్చుకున్' అండజాధీశ్వరునకున్ ఇత్యాదిప్రయోగములు వ్యవహరింపఁబడి సాధుత్వము గాంచినవి.

ఇట్లే యింకను ననేకము లగుమార్పులు వ్యాకరణములలోఁ గలవు. వ్యాకరణములను వదలి ప్రయోగములలోనికి వెళ్ళినచో మఱియు ననేకము లగు మాఱురూపములు కన్పించుచున్నవి. ఒక కవిత్రయము నందుఁ దక్క మిగిలినవారికృతులందు వ్యాకరణవిరుద్ధము లగు ననేక ప్రయోగములు కన్పట్టుచున్నవి. పూర్వులు గ్రామ్యము లని నిశ్చయించిన “నుయిదాఁటవానికిన్, ఓరాత్రి, జారవనితతోటి, చేసుక, పోయిన్, ఇరువై, అఱువై” మొదలగురూపములు గ్రంథములందు మహాకవులు వాడియున్నారు. వీనికిని వ్యాకరణములకును నింకను నేకత్వము కుదురలేదు. ఇట్టిమార్పు లంగీకారయోగ్యములా? కావా? అనువిషయ

ము పండితులు నిర్ధారణ చేయవలసి యున్నది. వ్యాకరణమునందు మార్పులుగూడఁ జేయవచ్చును గదా! అట్టిదాని కిట్టిపరిషత్తువారు పూనుకొన్నచో బాగుండెడిది.

ఉపసంహారము.

ఇట్లు వ్యాకరణములు భిన్నసంప్రదాయములు గలిగి పూర్వాధునికవైయాకరణులమతములు వేఱువేఱుగ నైపోయినవి. వాని నన్నిటి నేకముఖమునకుఁ దీసికొనిరావలయును. అన్నిటిని బరిశీలించి యొక్క వ్యాకరణము తిరిగి రచింపఁ బడవలయును. ప్రసంగవశమున నిట నొక మాట చెప్పవలసియున్నది. ఇట్టి యుద్దేశముతోనే నేను నన్నయాథర్వణుల గ్రంథముల నాంధ్రీకరించితిని. ఇఁకను వివరముగా వ్యాకరణములన్నియు శోధించి క్రొత్తవిషయములు చేర్చి విపులముగా వ్యాఖ్య వ్రాయవలయు నని సంకల్పించియుంటిని కాని "శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు" పనిచే దానిసంగతి మానవలసివచ్చినది. కాని, యది నా పుత్రుఁడు చిరంజీవి గణపతిశాస్త్రి యుత్సాహపడి మిగులశ్రమపడి దానికి వ్యాఖ్య విపులముగా వ్రాసియున్నాఁడు. దానిలోఁ బూర్వోక్తములగు వైరుధ్యములు తొలఁగింపఁబడి నన్నయాథర్వణానుక్తము లగు ననేకము లగువిషయములు చేర్పఁబడియున్నవి. అది చాలవఱకు సమగ్రముగా నున్న దని నాయభిప్రాయము. దానిపేరు "నన్నయాథర్వణకారికావళి" అని పెట్టఁబడినది. అన్నిసంప్రదాయములను సమగ్రముగఁ దెలుపుచు సర్వవిషయములను వివరించుచు వ్రాయుటకు నిట్టిపరిషత్తునకే శక్తి కలదు. కాని మావాఁడు వ్రాసినది సర్వవిధముల సమగ్రముగా నున్న దని చెప్పవలసియున్నది. అది యొకచేతిమీఁదుగా వచ్చియుండుటచే నందు నేవేని దోషము లుండవచ్చును. వానిని దెలుపుచు దానియందుఁ గొంతయభిమానము చూపవలయు నని పండితులను గోరుచున్నాను.

ఈపరిషత్తువారు సర్వగ్రంథపరిశీలనముతో నొకవ్యాకరణమును రచించిన బాగుండు ననియు నట్టిది త్వరలో రచింతురుగాక యని యుఁ గోరుచు నింతతో విరమించుచున్నాఁడను.

సంగీతసాహిత్యసమ్మేళనము.

ఉభయభాషాప్రవీణ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారు,
విజయనగరము.

నాదబ్రహ్మోపాసనమే నాహృదయంబున నాలాపించెద ।
అ. ఆదిమధ్యాంతరహితంబై ఆధారంబై హృదయగతంబై
మాధవభజనామృతమహితంబై మంగళమయజీవితఫలమైన॥ నా॥
చ. రసకలితంబై పరమసుఖంబై రాగభావమయమై
అసమబ్రహ్మానందసమానంబై నామజ్ఞానము మఱపించిన॥ నా॥

కవిచమత్కారజనకము లగుభావనలను ప్రతిపాదించుశబ్దార్థముల ద్వారా, రసోపాసకుండై పరబ్రహ్మాస్వాదసదృశ మగునానందమును గల్గించునట్లు గాయకుండు మనోహరభావప్రతిపాదక మగు నాదోపాసనము ద్వారా పరబ్రహ్మాస్వాదతుల్య మగు నానందము నొదవించుచున్నాఁడు.

"నకారం ప్రాణనామానం దకార మనలం విదుః, జాతః ప్రాణాగ్నిసంయోగా త్తేన నాదోఽభిధీయతే" అని నాదశబ్దమున కర్థము నిర్వచింపఁబడినది. "ప్రాణానలసంయోగమువల్ల ప్రణవనాదము సప్తస్వరములై పరఁగ" అని "త్యాగరాజు." ఆనాద మోంకార మైనట్లు చెప్పియున్నాఁడు. అది-"ఆహతము అనాహతము" నని ద్వివిధముగాఁ జెప్పఁబడియున్నది. అనాహతనాదముచే ఋషులు పరబ్రహ్మోపాసనముఁ గావించుచున్నారు. ఆహతనాదమును గాయకు లుపాసించుచున్నారు. దీనివలనఁ బ్రజారంజనము గల్గుచున్నది, తన్మూలమున లోకోపకారసంపాదనము గాయకులకే సాధ్య మగుచున్నది.

శబ్దములు, విభావానుభావసాత్త్వికవ్యభిచారిభావప్రతిపాదనముచేత రసోత్పత్తిని గల్గించునట్లు, స్వరములు నాదబ్రహ్మోపాసనముచేత రసభావోత్పత్తిని గల్గించుచున్నవి. రసమే బ్రహ్మము. పరబ్రహ్మము రసస్వరూపుఁ డనుటకు మాకు "రసో వై సః రసం హ్యేవాయం లబ్ధ్వా

నందీ భవతి" అనుశ్రుతి ప్రామాణ్య మగుచున్న దని పండితరాయలు తన రసగంగాధరమునందుఁ దెలిపియున్నాఁడు.

"విభావాదిసంవలితమును, రత్యాదిమిళితమును, భగ్నావరణమును, నగుచైతన్యమే రసము" అని యాలంకారికులు నిరూపించియున్నారు. ఈరసమే యానందజనకమైనది. విషయసంవలిత మగుచిత్తు నాలంబముగాఁ గొనుటచే నిది పరబ్రహ్మానందముగా లేక పరబ్రహ్మానందసదృశమైనది.

ఈరసానందము కవులచేతను గాయకులచేతను గూడ సాధింపఁబడుచున్నది. కావునఁ గవిగాయకులచే నిష్కృష్టముగా సాధింపఁబడుటలోనాశ్చర్య మే మున్నది?

సత్యారాధకుఁ డగు కవికిని గాయకునకును గూడ గమ్యస్థానమొక్క సత్యస్వరూప మగుపరబ్రహ్మమే. దేవతారాధనమూలముగా నిర్వికల్పసమాధ్యాదిసిద్ధియే గాంధర్వవేదమునకుఁ బ్రయోజన మని మధుసూదనసరస్వతి ప్రస్థానభేద మను గ్రంథమునందుఁ దెల్పియున్నాఁడు.

"కావ్యం యశసే" అను నాలంకారికవచనమందుఁ గల కావ్యప్రయోజనము లగు కీర్తి, ధనము, వ్యవహారజ్ఞానము, నమంగళనివారణము, మహానందము (కాంతాసమ్మితత్వముచే) వాచ్యము గాకుండ నుపదేశము, గానమువలనఁ గూడ లభ్య మగుచున్న వని చెప్పవచ్చును. "ఏకమాపాతమధుర మన్య దాలోచనామృతమ్" అనుటచేత శీఘ్రోపస్థిత మగునానందమును గల్గించుసంగీతమే పై ప్రయోజనములను శీఘ్రముగా సంపాదించుచున్న దని చెప్పవచ్చును. అది ప్రస్తుతలోకానుభవముచేఁ గూడ నిర్ధారిత మగుచున్నది.

"సంగీత మపి" అను శ్లోకమునందు సాహిత్యము గొప్ప దను నభిప్రాయము గల దని కొంద ఱందురు. రెండును సమాన మైనవే యని నే నందును.

మాధుర్యముయొక్క శీఘ్రోపస్థితి మొదటిదానియందలిసుగుణము. కావుననే సంగీతము-"శిశు ర్వేత్తి పశు ర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" అని కొనియాడఁబడినది.

ఆలోచనచే నమృతము వలె నుండుట రెండవదానియందలి సుగుణమై యున్నది.

కవి యిం దొకదానిని గొప్ప దని తెలుపుటలేదు. దీనికిఁ బ్రమాణము వీనిని భారతీ స్తనద్వయముగా నిర్ణయించుటయే. మనోహరము లగుటచేతఁగాని క్షీరరసప్రకృత్యాదులచేతఁ గాని యిందొకదానికి మహత్త్వమును నొకదాని కల్పత్వమును నిర్ణయింప వలనుపడమగదా! కావున రెండును సమానములే యని నాయుద్దేశము.

ధ్వని రసవ్యంజక మగునట్లు వర్ణ(అక్షర)సంబంధము లేకయే కేవలనాదము రసవ్యంజక మగుచున్నది.

శబ్దార్థములు లేని కేవలనాదమువలన శృంగారాదినవరసములను బుట్టింపవచ్చును.

కోయిలకుహూధ్వనియందు శృంగార ముట్టిపడుచుండును. గార్దభధ్వని హాస్యమును బ్రకటింప దని యెవ్వ రనఁగలరు? సముద్రఘోష వీరరసప్రతిపాదకము గాఁ దోఁచుచుగదా! కాకధ్వని బీభత్సరసమును గలుగఁజేయుచుగదా! గుడ్లగూబ, యఱుపు లేక మేఘనాదము భయానకరసప్రతిపాదకముగా నుండునుగదా! సింహనాదము రౌద్రరసవ్యంజకముగాఁ దోఁచనివా రెవ్వరు?

(గ్రుడ్డి) మూఁగబిచ్చగానిధ్వని కరుణరసస్ఫోరకమై యుండును.

నిశ్శబ్దాకాశము శాంతరసప్రతిపాదకము గదా!

ఇట్లే గాత్రమునందలి యాయా (వర్ణసంబంధము లేని) ధ్వనులే (సాత్త్వికాదిధ్వనులు) భక్త్యాదులను బ్రకటించును.

అద్భుతమగుసీనాదరూప మగు సంగీతము, మాటలు లేకుండ రసజ్ఞుఁ డగువాని నాకసమున కెగిరించును,. స్వర్గాధిపత్యముఁ గావింపఁజేయును. అద్వైతానందసాదృశ్యమును సంఘటించును.

అధికదీనునిఁ గావించి యంధతామిస్రముల బడఁద్రోయును. అలౌకికము లగుసుఖదుఃఖముల ననుభవింపఁజేయును.

దీనివలన సాహిత్యము లేకుండినను గూడఁ గేవలనాదరూప మగుసంగీతము సాహిత్యభావములను గొంతవఱకుఁ బ్రకటింపఁ గల దని తేలుచున్నది.

సాహిత్యభూషితము కాని కేవలముసంగీతమువలన సాహిత్యభావములు ప్రకటింపఁబడినట్లే రాగాదిజ్ఞానము లేనివానిచేఁ జదువఁబడినప్పటికిని, బద్యములలోను, గద్యములలోను, సంగీతము ప్రకటిత మగును.

కేవలనాదరూప మగుసంగీతమువలన నాయారసభావములు ప్రకటింపఁబడినప్పటికి నవి సుస్పష్టముగా గోచరింపఁబడవు. ఈనాదమువలన నీభావము ప్రకటింపఁబడి యుండు నని యూహింపవలసియే యుండును.

కేవల మగుసంగీతమున సాహిత్యమును గేవలసాహిత్యమున సంగీతమును నుండుటవలనను, శ్రుతిమాధుర్యము, రాగము, మొదలగు సుగుణములచే సామరస్య మేర్పడుటవలనను, శబ్దార్థములకువలెను, పార్వతీపరమేశ్వరులకు వలెను, సంగీతసాహిత్యములకు నిత్యమగు నవినాభావసమ్మేళనము గల దని తేలుచున్నది. సంగీతముతోఁ గూడిన సాహిత్యమువలననే సంపూర్ణ మగు రసభావములు సుస్పష్టముగాఁ బ్రకటింపఁబడును.

సాహిత్యముతోఁ గూడని కేవలనాదమువలన సుస్పష్ట మగు నర్థము లభింపనట్లే సంగీతముతోఁ గూడనిసాహిత్యమువలనఁ గూడ సుస్పష్ట మగునర్థము ప్రకటింపఁబడఁజాలదు.

వాద్యములందు నాదరూప మగు సంగీతమాత్రమే వినఁబడుటచే వానివలన భావములు స్పష్టీకరింపఁబడఁజాలవు. సంపూర్ణ మగురసోత్పత్తి గలుగనేరదు.

సభ్యులమనస్సులయం దాయారసములను భావములను గల్గించుటకు సాహిత్యయుక్త మగుసంగీతమే సమర్థ మగును. సాహిత్యయుక్త మగు సంగీతము వాద్యములందుఁ బ్రకటింపఁబడదు కావున నట్టిసంగీతము గాత్రపాఠకునకే సాధ్యమగుచున్నది. కావుననే గాయకునకుఁ బ్రాధాన్యమును వాద్యకారునకుఁ బ్రక్క వాద్యమును యుక్తమగుచున్నది.

పరబ్రహ్మవాచకముగా వేదాంతములందు నిర్ధారితమగు నోంకారము నుచ్చరించుట కొక్క మనుష్యకంఠమే సమర్థమైనది- ఆప్రణవమే సాహిత్యము, ఆసాహిత్యమును బోషించునదియే సంగీతము.

దివ్యమాధుర్యసంకలితమును నుత్తమంబు నగుప్రణవనాదశ్రవణముచేత సత్కావ్యశ్రవణముచేతను వలెనే దుర్మార్గుఁడు సైతము సన్మార్గుఁ డగుచున్నాఁడు.

సత్కావ్యమువలెనే యట్టిప్రణవనాదముగూడ నరుదుగా నున్నది.

గాయకశ్రేష్ఠులు దీనికొఱకు గాఢతపోదీక్ష వహింపవలసి యున్నదని విన్నవించుచున్నాను.

గీత, వాద్య, నృత్యముల చేరికవలన సంగీత మేర్పడు నని యొక మతము. గీతవాద్యముల కూడికయే సంగీత మని వేఱొక మతము. మొదటిమతమునుబట్టి హరిదాసులే (భాగవతారులే) గాయకు లగుదురు. రెండవమతమునుబట్టి ప్రస్తుతము గానసభలందుఁ బాడుచున్నవారును గాయకు లగుదురు. మొదటిమతమే యుక్తమువైనట్లు నిర్ణయింప వీ లగుచున్నది.

శాస్త్ర మన నేమి? సంగీతశాస్త్రజ్ఞుఁ డెట్టివాఁడు?

అనుభవమే శాస్త్రరూపముగాఁ బ్రకటింపఁబడును. అనుభవవిరుద్ధ మగు శాస్త్రము శాస్త్రము గానేరదు. పూర్వపు గాయకశ్రేష్ఠుల నిర్దుష్ట మగుసంగీతానుభవమే సంగీతశాస్త్ర మైనది. ప్రపంచమందున్న ప్రతిశాస్త్రము ననుభవరూపమే యై యున్నది. లక్ష్యము ముందుపుట్టినది. తరువాత దానిని సంగ్రహించినది లక్షణము. నిర్దుష్ట మగు లక్ష్యమునకు విరుద్ధ మగుశాస్త్రము శాస్త్రము కాదు.

యోగ్యములగు నూతనానుభవములచే శాస్త్రములు తిరుగ వైశాల్యము నొందుచుండును. వివిధశాస్త్రములును నిట్లు వైశాల్యమును బొందుచునే యున్నవి.

పారతంత్ర్యమువలన మనశాస్త్రపరిశోధనలు చాలకాలముక్రిందటనే యాఁగి పోయినవి. ప్రస్తుతానుభవము పూర్వానుభవముకంటెఁ జాల హీనదశయం దున్నది. కావున మరలఁ బరిశోధన జరుగవలసియున్నది. ఇందుకొఱకు సంగీతరసాలంకారాదివిషయములు గలభరతాదుల

గ్రంథములను పఠింపవలయును. సామవేదముయొక్క గానమునకు సంబంధించిన సంగీతగ్రంథములు కొన్ని గలవని తెలియుచున్నది. అవిమిగుల ప్రాచీనకాలికములుగా నిర్ణయింపఁబడినవి. మఱియు, సంగీతరత్నాకరము మొదలగు సంగీతగ్రంథములఁ బరిశోధించి గాయకులు యథార్థమగు సంగీతమును బ్రకటింపఁ గోరెదను.

నవీనులచే నిటీవలఁ బ్రచురింపఁబడిన, సంగీతవిద్యాదర్పణము, సంగీతసుధాంబుధి మొదలగు గ్రంథములయందుఁ గలసాహిత్యగ్రంథము చాలవఱకు దోషసంకలితమై యున్నది. కావున గాయకులు తెలుఁగునందుఁ బ్రకటింపఁబడిన యీ గ్రంథములను బ్రమాణముగా గ్రహియింపఁగూడ దని మనవిచేయుచున్నాను.

నిర్దుష్ట మగు సంగీతసాహిత్యసమ్మేళనము గలగ్రంథములు తెలుఁగునందుఁ బ్రకటింపఁబడవలయును. దీనికై గాయకోత్తములు కృషి గావింపఁగోరెదను. ఇంతవఱకు బ్రకటింపఁబడిన గ్రంథములలో నిర్దుష్టములగు గ్రంథములు చాలఁ దక్కువ.

సువిమర్శకులగు సంగీతశాస్త్రజ్ఞులు నూతనమగు సంగీతానుభవమును విమర్శించి లక్షణసమన్వయము గావింపవలయును.

సంగీతసాహిత్యములలో నెంతయు పాండిత్యము లేని యల్పజ్ఞుఁడనగు నేను సంగీతసాహిత్యసమ్మేళన మొనర్చుట సాధ్యము గాని పనియైననుత్సాహాతిశయమువలన నించుక పరిశోధనము చేయఁదలఁచుచున్నాను. ఇందులకు విద్వాంసులప్రోత్సాహ మత్యావశ్యక మయియున్నది.

శ్రుతి స్వర రాగ తాళ లయజ్ఞానములు గలవాఁడు సంగీతశాస్త్రజ్ఞుఁడు. ఇతఁడు చమత్కారజనక మగుభావన లేనిచో గాయకుఁడు కాఁజాలఁడు. స్వరరాగాదిజ్ఞానము గల్గి శక్తి వ్యుత్పత్తులు గల్గిన భావనాశాలి గాయకోత్తముఁ డగుచున్నాఁడు. స్వరలయాదిజ్ఞానము లేకయే పాట పాడువా రనేకు లున్నారు. శబ్దార్థజ్ఞానము లేని కవుల కావ్యములవలెనే వారిగానము నింద్యము కావచ్చును. శబ్దార్థములు మాత్రమే కవిత్వము కానట్లు స్వరములే సంగీతము గాదు.

కవిత్వమునకు శబ్దార్థాదిజ్ఞాన మావశ్యక మైనట్లు గాయకునకు స్వరలయాదిజ్ఞాన మావశ్యకము.

ప్రతిభలేని శాస్త్రజ్ఞుఁడు గాయకోత్తముఁ డనుకొనుటకంటెఁ బరిహాసాస్పద మైనసంగతి వేఱొకటి యుండదు.

భావములేని స్వరకల్పనము భావనారహితుఁ డగు శాస్త్రజ్ఞునిచేఁ గావింపఁబడు చుండును. అది శాస్త్ర మని యవివేకు లగుజనులు విశ్వసింతురు. భావహీన మగుసంగీతము, సంగీతము కానేరదు. అర్థము లేని మాటవలె నర్థములేని పాటకూడ నపరిగ్రాహ్యము.

కావున స్వరరాగలయాదులే సంగీతము గానేరవు.

శబ్దార్థాలంకారములు రసోత్పాదకములై కవిత్వ మగునట్లు స్వరరాగలయాదులును, రసోత్పాదకము లైనపుడే సంగీత మగుచున్నవి.

కర్ణాటకపద్ధతి గలగానమే సంగీత మనుబూటకపువాద మొకటి గలదు. దీనిని గొందఱు విశ్వసించుచున్నారు. ఇది యజ్ఞానమూలక మగు నంధవిశ్వాసము.

ప్రపంచమునం దనేకములగు బాణీలుకలవు. శ్రుతిస్వరాదిజ్ఞానము గలభావనాశాలిచేఁ బాడఁబడిన యేబాణీయును శాస్త్రవిరుద్ధము కాదు. బొంబాయిబాణీ గాని హిందూస్థానిబాణీగాని సంగీతము కాదనుట యవివేకవిలసితము.

కృష్ణభాగవతముల నాడుసాంప్రదాయ మాంధ్రులలోఁ జిరకాలమునుండి యుఁ గలదు. వీనియందలి గేయములను శ్రుతిస్వరరాగతాళయుక్తముగాఁ బాడుభాగవతు లగువేమగాం డ్రనేకు లిప్పటికిని గలరు.

ఈబాణీ సామాన్యముగా పల్లెలయం దుండువారికిఁ బరిచిత మై యుండును.

ఇట్లే తోలుబొమ్మల నాడించువారు పాడెడిబాణీ వేఱొకరీతిగా నుండును. ఇట్లే బోనెలవానిపదములయందలి బాణీయు హరికథలందుఁ గలమట్లయొక్క బాణీయు భజనకీర్తనలఁ బాడువారిబాణీయు వేర్వేఱుగా నుండును.

శ్రుత్యాదిజ్ఞానయుక్తముగఁ బాడఁబడినను గొందఱు నాగరకంమన్యులు పైవానిని సంగీతముగా నంగీకరింపరు. ఇది దుర్భరము.

శ్రుత్యాదిజ్ఞానరహితముగా, త్యాగరాజకృతులు పాడినను నదిసంగీతము కానేరదు. శ్రుత్యాదియుక్త మైనపుడు తందనాలపదాలుకూడ సంగీతమే యని నానిశ్చితాభిప్రాయము. బహుళనియమయుక్తము ను క్రమసాధనసంకలితము ను నగు, సంగీతము, ఉత్తమసంగీతముగా నంగీకరింపఁబడుట న్యాయమే యగును.

దానిని గ్రహింపఁగలవారు కూడఁ గొలఁదిగనే యుందురు. దీనికి గానసభలే దృష్టాంతమై యున్నవి. కాని యివి యింకను సంస్కరింపఁబడవలసి యున్నవి. ఇది యనవసరము లగుస్వరకల్పనలకు, లెక్కవంపకములకు, యుద్ధములకుఁ బ్రాధాన్యము నొసంగుట మాని-రసభావములకు భగవద్భక్తికిని బ్రాధాన్య మొసంగుటుచిత మని మనవిచేయుచున్నాను. గానసభలయందు "ప్రోగ్రాము"నిర్ణయము రసభావభంజకమేమో యని నాతలంపు సహృదయులు విమర్శింతురుగాక.

ఆంధ్రులలోఁ బలువు రనుకరణాసక్తు లగుటచేతఁ దమప్రత్యేకతాలక్షణ మగు నాంధ్రబాణీని విడిచి దాక్షిణాత్యులను, బొంబాయివారిని, హిందూస్థానీవారిని ననుకరించుచున్నారు.

ఆయాసంగీతముల విధానముల గ్రహియించుట మంచిదే కాని యిట్లు ప్రతిభాశూన్యముగా వారిసంగీతము ననుకరించుట యభివృద్ధికిభంగకరము.

ఆంధ్రభాషవలె గానమున కనుకూలించు భాష వేఱొంటి కానుపింపదు. నవరసములను బ్రకటింపఁజేయఁగల సౌకుమార్యాదిగుణము లొక్క యాంధ్రభాషయందే కలవు. కావుననే "దేశభాషలందుఁ దెలుఁగు లెస్స" అనినాఁ డా మహారాజశేఖరుఁడు. కావుననే దాక్షిణాత్యగాయకులు త్యాగరాజాదులకృతులనే యాదరించిరి. ఆంధ్రభాష మనోహరవర్ణసంకలితము. ఆంధ్రసాహిత్యవిశిష్ట మగుసంగీతము స్వర్గసుఖతుల్యము. అనుపమానభావపదమంజులము లగుత్యాగరాజకృతు లాంధ్రుల భాగ్యచిహ్నములు !

వీనిని భావయుక్తముగాఁ బాడుటను గాయకు లింకను నభ్యసింపవ లసియున్నది.

త్యాగరాజు పాడిన స్వరసంప్రదాయము దాక్షిణాత్యగాయకుల కెంతవఱకు లభ్యమైనదో తెలియదు. కాని యిప్పుడు వారు పాడుచున్న కృతులలోఁ బెక్కింటి కనుగుణ మగు భావప్రకటన, గల స్వరవిధానము వారిలోఁ గాన్పించుట లేదు. ఇట్లు భావహీనముగా, త్యాగరాజు గాన ము చేసి యుండు నని సహృదయు లూహింపఁజాలరు.

9 వీరిలో ననేకులకు భాషాజ్ఞానము లేనందునఁ గృతులలోని యర్థ వంతము లగుపదములు నిరర్థకములుగా మాఱినవి. భాషాభావమునొ క్క జ్ఞానము లేనందువనే భావమునకు విరుద్ధ మగు స్వరముల పోకడ యేర్పడెను.

అర్థము చెడుటకు, పదములమార్పునకు:—

భుజగభూషణా: రామ:- తారకాధిపా: రామ:- తరయా రఘువర:

శ్రీరాముఁడు భుజగభూషణుఁడు, తారకాధిపుఁడు గాఁ జేయఁ బడినెను.'భుజగభూషణుఁడు! తారకాధిపుఁడుగాఁజేయఁబడెను. 'భుజగ భూషణార్చితా" అనియు, "తారకాధిపానవా" అనియు నుండవలెను. "తరయా" అనుచోట, "తారయ!" (తరింపఁజేయుము) అని యుండ వలెను.

"జనియించెదరు జాలినకరుణతో",

మొదలు నంటఁగఁజేయు మందనుచు, (ఇందర్థము లేదు.)

ఇట్టి, తొలి నేను జేసినపూజా, ఫలమే

అడ మోడిగలదె రామయ్య.

మొదలగు కృతులయందు సరియగు నర్థము లభింపదు.

గాయకులు కృతులయొక్క భావార్థములనైన నెఱుఁగుటకుఁ బ్ర యత్నించుకొనుట యన్యాయము.

గాయకులు కొంతవఱకైన సాహిత్యజ్ఞానమును సంపాదింపనంత వఱకు, నిట్టిదోషము లు తప్పవు.

సంగీతమునందు సాహిత్య మెట్లున్న నేమి ? అను దురభిప్రాయము కొందఱికిఁ గలదు. ఈయభిప్రాయమును పామరులు హర్షింపవచ్చును. కాని పండితులు హర్షింపఁజాలరు. సాహిత్యార్థమునకుఁ బ్రాధాన్యము లేకుండఁ గృతులను బాడుటకంటె వానిని విసర్జించి నాదరూప సంగీతముల నాలపించుట యుక్తము.

సంగీతసాహిత్యములలో సాహిత్యభావమును సంగీతము పోషింపవలెను. ప్రస్తుతకాలమున నట్లు పాడుటలో గానకళానిధి బిరుదాంకితులును మద్గురువర్యులు నగు బ్ర॥ శ్రీ పట్రాయని సీతారామశాస్త్రి గారును, వాగ్గేయకారక బ్ర॥ శ్రీ హరి నాగభూషణముగారు నగ్రగణ్యు లని చెప్పకతీరదు. సాహిత్యభావపోషకము గాని సంగీతము సంగీతము కాదు.

త్యాగరాజకృతులలో సాహిత్యమునకుఁ బ్రాధాన్యము లేదని మ. రా. పి. సాంబమూర్తి అయ్యరుగా రీనడుమ విజయనగరాంగ్లకళాశాలయం దుపన్యసించియున్నారు. పై వాదము యుక్తివిరుద్ధము ననుభవవిరుద్ధమును నైయున్నది. కొందఱు దాక్షిణాత్యగాయకులచే భావార్థశూన్యముగాఁ బాడఁబడుచున్న కృతులను గాంచి వీ రిట్టిభ్రమకు లోనైయుందురు. త్యాగరాజు మహాభక్తవరేణ్యుఁడు. మహాకవి. భావనాశాలి. అట్టిమహానుభావుఁడు, భావహీనముగా, సాహిత్యార్థమును బోషింపని సంగతులతోఁ గృతులను బాడియుండు ననినచో నెవ్వఁడును నమ్మఁజాలఁడు. ఇప్పు డీకృతులను గొందఱు దాక్షిణాత్యగాయకులు పాడినట్లే పూర్వము త్యాగరాజు పాడినట్లు నిదర్శనము లేదు. కావున వీరి వాదము నిరాధారము, వీని కాధార మొక్క దాక్షిణాత్యగాయకుల త్యాగరాజకృతిగానవిధానమే.

కావున త్యాగరాజకృతులందలి సాహిత్యమునకే ప్రాధాన్య మనుట నిర్వివాదాంశము. గాయకులు తత్ప్రాధాన్యమును బాడుచేయుటచే నిట్టివాదమున కవకాశము గల్గినది. త్యాగరాజకృతులలోని గంభీరభావములు విశేషముగా సంగీతమును బ్రకటించుటకు వీలు గల్గించుచున్న వని చెప్పవచ్చును.

గీతములు, వర్ణములు, కృతులు, మున్నగువానియందలి లక్షణ విశేషముల నించుక విమర్శించెదను.

ఆంధ్రభాషయందుఁ గలపద్యములలోని సంప్రదాయము గేయములం దనుసరింపఁబడిన దనుట నిర్వివాదాంశము.

పద్యములందుఁ దాళము గలదు- కాని యవి గణనిబద్ధములు. కావుననే తాళజ్ఞానము లేనివాఁడును బద్యముల వ్రాయ వీలగును. తాళము ననుసరించి శబ్దములను గూర్చుట గేయలక్షణము. నియమితగణ ముండవలె ననునియమము వీనియందు లేదు. కావుననే తాళజ్ఞానము లేనివాఁడు గేయములను వ్రాయఁజాలఁడు.

ప్రాసనియమము కన్నడమునందును నాంధ్రమునందును గలదు. యతినియమ మాంధ్రభాషయందే గలదు.

ఇయ్యది యాంధ్రభాషకు సహజ మైనది. కావుననే జానపదుల పాటలలోఁ గూడఁ బ్రాముఖ్యము నందినది.

ప్రాసము లేనిపాట లుండిన నుండవచ్చును గాని సామాన్యముగా యతి లేని పాటలు కానుపింపవు. అర్థము లేకుండినను సరే యతి యుండవలెను! యతికొఱకు వ్యర్థపదములైనను బ్రయోగింపవలయును! ఇది చెవులకింపుగా నుండుటచేత నన్నయభట్టారకాదు లనుసరించిరి. ఇప్పటివఱకును బద్యకవులేమి, గేయకవులేమి యనుసరించుచున్నారు. జానపదులగేయములలో యతిని నిర్వహించుటయందుఁ గలదీక్షను మీరుగమనింపుఁడు !

"చేతిగాజులతోను చెల్లెళ్ళతోను."

ఇట్లని యతికొఱకు వ్యర్థపదములను బ్రయోగింపవలె నని నా యుద్దేశము కాదు. సమర్థులగు కవులు వ్యర్థపదములు లేకుండ యతిప్రాసనియమమును నిర్వహించుచున్నారు. కాఁగా, గణయతిప్రాసనియమము పద్యములం దెట్లనుల్లంఘనీయమో తాళయతిప్రాసాదినిర్ణయము వర్ణములందును గృతులందును, బదములందును, నట్లే యనుల్లంఘనీయమైనదిగా ననుసరింపఁబడుచున్నది. శ్రవణమాధుర్యమును సంపాదిం

చుటలోఁ బద్యములలోఁ గేయములలో సౌలభ్యము గల దని యంగీకరింపనివా రుండరు గదా! అట్టిగేయములలో యతిప్రాసల యావశ్యకత హెచ్చుగానుండు ననుట నిర్వివాదాంశము.

పిళ్లారిగీతములందు యతిప్రాసనియమము సరిగా ననుసరింపఁబడినట్లు కనుపింపదు. అనేకము లగుపెద్దగీతములయందు యతిప్రాసనియమము కానుపింపదు.

ఉ. (ఆనందభైరవి. ఆదితాళము) కమలసులోచన—

శ్లోకములను స్వరము ననుసరించి యిమిడ్చి గీతములుగా వ్రాయుట యొకపద్ధతి.

ఉ. భైరవి. శ్రీ ఇరఅమా—

ఇందు యతిప్రాసము లుండుట కవకాశము లేకపోవుట యటుండ భావపోషణమునకే యవకాశము లేకుండ నున్నది ఇట్లు గీతములను వ్రాయుట యన్యాయ్యము.

గీతము లనేకములు కన్నడాదిభాషలయం దున్నవియే యాంధ్రులకు శరణ్యము లైనవి. వీనికి బదులుగా నేను వ్రాయుచున్న యాంధ్రగీతములను మున్ముందు గాయకలోకమునకు సమర్పింపఁ బూనియున్నాను. గీతములందు-పల్లవి, అనుపల్లవి, చరణము, యతిప్రాసాదినియమము లేనట్లు తోఁచుచున్నది. స్వరజతులయం దీయతిప్రాసనియమము గోచరించుచునే యున్నది. సంస్కృతగేయములం దీయతిప్రాసనియమము లేకున్నను నాంధ్రలక్షణానుయాయులచే వ్రాయఁబడిన కొన్ని సంస్కృతగేయములం దీనియమము పాటింపఁబడినది.

వర్ణములవలన లయజ్ఞానము, స్వరజ్ఞానము, అకార ఇకారాదులను హెచ్చుగ గాత్రమునందు పాడఁగల్గుటయు ననుభవసిద్ధమై యున్నది. వర్ణములందు, పల్లవి, అనుపల్లవి, చరణములు నుండును. పల్లవియం దొకటిగాని రెండుగాని యతులుండును. అనుపల్లవియందును నిట్లె యొకటిగాని రెండుగాని ప్రాసము లుండును. పల్లవికి ననుపల్లవికిని ప్రాసనియమ ముండును. చరణమునకు పల్లవి యనుపల్లవుల కున్నప్రాస ముండ నక్కఱలేదు.

చరణములెక్కువగా నుండినయెడల వానికి వేఱుగాఁ బ్రాసములుండును. మొదటియావృత్తియందలి మొదటియక్షరమునకుఁ (సవర్ణమగు) సమానమగు నక్షరము రెండవయావృత్తియందలి మొదటియక్షరమై యుండుటయే యీయతినియమము. అట్లే మొదటియావృత్తియందలి రెండవయక్షరమునకు సమాన మగునక్షరము మూఁడవయావృత్తియందలి రెండవయక్షరమై యుండుట ప్రాసనియమము. పద్యములందు యతిప్రాసల కెట్టినియమము గలదో యట్టినియమమే యిందును నాదరింపఁబడినది. కావున వర్ణములయందును గృతులయందును యతిప్రాసనియమము లే దని తలంచుట యవివేకము. ఇట్లనుటకు వలసినంత ప్రమాణగ్రంథము నాయొద్దఁ గలదు.

శంకరాభరణము.

ప. సామీ నిన్నే కోరి చాల మరులుకొన్నదిరా

అ. కామనము సేయక దయఁజూడరా గోపాల.

చ. నీరజాక్షి నీపై ...

ఇట్లు యతిప్రాసనియమముగాఁ బాటింపఁ బడిన దని వందలకొలఁది వర్ణములను గృతులను బ్రమాణీకరింపఁగలను.

వర్ణకారులు పాటించిన యతిప్రాసనియమమునకు విరుద్ధముగాఁ బ్రస్తుతసంగీతవిద్వాంసులు వీనిని బాడుచున్నారు.

కొన్నిసంగీతగ్రంథముల (సంగీతవిద్యాదర్పణాదుల) యందుఁగూడ నీనియమమునకు విరుద్ధముగా సంగీతగ్రంథము కనఁబడుచున్నది.

శ్రీరాగము—(ఆది)

ప. సామీ! నిన్నే కోరి యున్నాను—చలముసేయ మేరగాదుర॥

అ. భూమిలో వెలయు శ్రీగర్భ—పురినివాస! పసుపతీశ॥

చ. నీరజాక్షి నీపై॥

ఇందు పల్లవి, యనుపల్లవుల రెంటియందును యతిగల దని సహృదయులకు సుస్పష్టమే గదా!

ఇది సంగీతవిద్యాదర్పణమందు యతికి భంగకరముగా ముద్రింపఁబడి యున్నది. ప్రస్తుతము సంగీతవిద్వాంసులచే నట్లే పాడఁబడుచున్నది.

ఇంత ముఖ్యమగువిషయములో సంగీతవిద్వాంసులు శ్రద్ధతీసికొనకుండుట యన్యాయ్యము. వీరిలో ననేకులకు యతిప్రాసాదు లున్న వని తెలియక పోవుటయే దీనికిఁ గారణము- తెలిసి యుండినచో నిట్లు పాడుట యలసత వలన నైయుండును. వీ రెట్లు యతిభంగము చేయుచున్నారో

3. అ. సీసీ. సీసని. పమారి. గరిసరి. సాసాసామరి. పమనిప. సనిమప.

భూడూడూమిఇ ఇలోవె ఎఎలలఅయూడూడూ. శ్రీఇగఅర్భఅ పుడురిఇ

4. నిసరి గారిసరినిసానిపనిసరి. సనిపదనిపమరిగారినిసరిమ॥ పా॥

నిఇఇఈఇ వఅసఆఅ వ అఅఅ నుడూపఅఅఅఅతి ఈఇఇఇఇశ॥

"పురినివాస'' అనుదానియందుఁగల పువర్ణము 4వ ఆవృత్తియొక్క మొదట నుంచుట వర్ణకవి యుద్దేశముగదా!

,,   మరి-పమనిప. సనిమప

,,   ఉఉ ఉఉ శ్రీఇ గఅర్భఅ

నిసరి గారిసరి నిసానిపనిసరి సనిపదనిపమరిగారినిసరిమ.

పుడుడుఁఇనిఇవఅఅస అఅఅపఆసు ఉఉపఅతి ఈఇఇఇఇశ.

వర్ణములలో నర్థస్ఫూర్తి యెట్లును లేదు గావున నిట్లు సర్దుకొని పాడినయెడల "పువర్ణము" ఆవృత్తిమొదటికి వచ్చి యతిభంగము కాకుండును. కావున సంగీతవిద్వాంసు లిఁకముం దట్లుచేయుదు రని నమ్ముచున్నాను.

ఇట్లే యనేకవర్ణములలో యతిప్రాసనియమమును గాయకులు భంగపఱిచిన సందర్భము నాయొద్దఁ గలదు. ముస్ముందు నేను బ్రకటింపఁబూనిన "సంగీతసాహిత్యసమ్మేళనము" అనుగ్రంథమున వానిని సమగ్రముగాఁ బ్రకటించెదను. దానిఁ బరికించి సంగీతవిద్వాంసు లిట్టిదోషములనుండి విముక్తులు గాఁ గోరెదను.

అపస్వరముల నుచ్చరించుటవలన సంగీతమున కెట్టినష్ట మని విద్వాంసులు భావింతురో యతిప్రాసనియమభంగమువలన సాహిత్యమున కట్టినష్ట మేర్పడు ననియు, సంగీతసాహిత్యములలో దేనికి భంగము కలిగినను

రెండిటికిని భంగముకల్గినట్లుగానే మెచ్చవలసి యుండు ననియును, సంగీతవిద్వాంసులకు మనవిచేయుచున్నాను.

వర్ణకవులు యతిభంగముఁ గావించిన పరిస్థితులు చాలస్వల్పము గానున్నవి. ఇదిపొరపాటువలన జఱిగిన దని నిర్ణయింపవచ్చును.

నాట—సామిః నిన్నేకోఁరినాను—చాలదయఁజూడర !
భూమివెలయు శ్రీ వేంకటేశ !

'పఫ బభ వ' లకు యతిమైత్రి లేదు. యతి యుంచు ననుభ్రమచే నిట్లు జఱిగినను జరుగవచ్చును. లేదా పొఱపాటై యుండవచ్చును- ఇట్టియుదాహరణములు స్వల్పముగనే లభించినవి. వర్ణకవులకు యతినియమము పాటింపవలె ననునుద్దేశము లే దనుట పొసగనిమాట. నియమపాలనోద్దేశ మే వారి కున్నట్లు పొడలకొలఁది యుదాహరణము లీయఁగలను.

వర్ణములలో నకారాదులు హెచ్చుగా నుంచుటకు వీ లగునట్లు వర్ణకవులు చిన్నచిన్న వాక్యములను వ్రాసి యున్నారు. అందువలన "నివాస" ఇత్యాదులగు ననేకస్థలములందు 'నిఇఇఈఇవఅసఆఅ' అనిహ్రస్వాక్షరములనుగూడ అకార, ఇకారాదులచేఁ బెంచుట వర్ణములలోఁ గానఁబడుచున్నది.

సంస్కృతకవుల గేయములలో దీర్ఘాక్షరములకు మఱికొంత దైర్ఘ్యము సంపాదించుట కానవచ్చును, గాని, హ్రస్వాక్షరములను దీర్ఘముగాఁ జేయుట యెచ్చటనో గాని కానుపింపదు.

అట్లు వ్రాయ వీ లగు ననియు, గీతాదులందు స్వరానుసారియగు సాహిత్యములేదనియు నేను, రెండుసంవత్సరములక్రిందట జఱిగిన భారతీతీర్థసభయం దుపన్యసించియున్నాను. ఇట్లు వ్రాయకుండినయెడల సర్థబోధగలుగనేర దని గీతవర్ణకారు లింకముందు గమనింపఁ గోరెదను.

అష్టపదులందును, తరంగములందును దీర్ఘాక్షరము లున్నచోటను, సంబోధనాదు లున్నచోటను అకారములను హెచ్చించుట కానఁబడును గాని హ్రస్వాక్షరములయొద్ద అకారములను పెంచుట సాధార

ణముగాఁ గానుపింపదు. పదవిరామమునకు మాత్ర మొక్కొక్కచో హ్ర స్వాక్షరమున కించుక దీర్ఘ ముంచుట కానవచ్చును ఇట్లుండుటవలననే వానియం దర్థబోధ గలుగును.

16

"పశ్యతి దిశిదిశి రహసిభవంతం
తదధరమధుర మధూని పిబంతం
నాథహరే! జగన్నాథహరే!
సీదతి రాధా వాసగృహే కృష్ణ!"

గాయకులకు ఛందోలక్షణాది జ్ఞానము లేకుండుటవలన త్యాగరాజాదుల కృతులయందుఁ గలిగిన దోషములను వేఱొక వ్యాసమునందుఁ జర్చింపఁ దలఁచితిని. కావున నింతతో దీనిని విరమించుచున్నాను.

ఆంధ్రసాహిత్యపరిషత్తువారు నాయభిప్రాయములను విమర్శించి పై విషయములను దేశవ్యాప్తములు గావించెద రనియు నీవ్యాసమును వారిపరిషత్పత్రికయందుఁ బ్రకటించెద రనియు విశ్వసించుచున్నాను.

ఈనడుమ విశాఖపట్టణమునందుఁ జరుపఁబడిన, భారతీతీర్థసభ యందు నేనీవిషయమును గూర్చి యుపన్యసింపఁగా నాయభిప్రాయ ముతోఁ జాలవఱకేకీభవించి నాకు మిగులఁ బ్రోత్సాహము నిచ్చిన సాహిత్యసమ్రాట్టు లగు శ్రీ జయపురాధీశ్వర శ్రీ విక్రమదేవవర్మమహా రాజావారికిని, నాకు సంగీతవిద్యాగురువు లైన గానకళానిధి బ్ర. శ్రీ పట్రాయని సీతారామశాస్త్రిగారికిని ధన్యవాదముల నర్పించుచున్నాను.

శ్రీవిశుద్ధాంధ్రభాషాదుర్దశ.

(ఆంధ్రసాహిత్యపరిషత్తు రత్వ్యము.)

విద్వత్కవిరత్నాదిబిరుదాంచితులు పుల్య ఉమామహేశ్వరశాస్త్రిగారు.
పాలకొల్లు.

శ్లో. యస్యా గీర్వాణవాణీ శిర ఉపరతలం తద్భవా దేశ్యవాణీ
పాదాన్తౌ తచ్ఛరీరం వదన మపి పరా వ్యాకృతిః ప్రాణవాతాః
సాహిత్యాత్మా రసో౽ఙ్గా న్యఖిలశుభకలా గ్రామ్యవాణీచ పాయు
స్సైషాన్ధ్రీ స్వాఙ్గభేదా త్సుకవిజనకృతా త్త్రోవితాన్యాశిషు స్త్యై. ౧

శ్లో. శ్రీమన్నన్నయతిక్కనాఖ్యభయవాగీశానసంవర్ధితా
శ్రీమత్కృష్ణమహీపతిప్రముఖసద్భూపాలసంభూషితా
విద్వద్రాజరసజ్ఞమస్తకధృతా సద్దేశ్యసమ్మానితా
వాణ్యాన్ధ్రీ విలసత్యహో కలివశా దాత్మావనా యూఘనా. ౨

మహాశయులారా! గతవర్షములలో నేను వ్రాసిన వ్యాసముల వలన నెట్టిప్రయోజనము కలిగిన దని విచారించిన నాచారనిర్వహణమే యని తేలినది. ఇపుడు గూడ నట్టిదియే యైన నాచారనిర్వహణమే ఫలమగు నదియు లేకున్న నుద్దిష్టఫలము చేకూరు ననునాసతోనే యుంచుల కుపక్రమించుచుంటిని. పరిషత్సభ్యున నేప్రాచీననవీనకవుల కవితామతల్లికలం గూర్చియో లేక యేయతిప్రాసాదులం గూర్చియో లేక యేవ్యాకరణాంశములం గూర్చియో యాన్ధ్రభాషాభిమానులగు విద్వద్వతంసులచే వ్రాయఁబడిన వ్యాసరాజములం జదువుటయుఁ బాఠమన్యులు విని యెటో మస్తకములం గదల్చుటయు వానిని బరిషత్పత్రికాముఖమున వెల్లడించుటయు, వీనివలన నుభయులును గృతార్థుల మని తలంచుటయు నొకయాచార మైనది. కాని యాన్ధ్రసారస్వతోద్ధారకసంఘములెన్నియున్న నధోగతిం జెందుచున్న యాన్ధ్రభాషాయోషామణి నుద్ధరించుటకు వలయు కార్యక్రమము నారంభించి పనిచేయుచున్న సంఘ మొక్కటియు నింతవఱకుఁ గానరాకుండుట విచారకరము. తమతమయభిమా

నానుసారము బిరుదముల నొసగుటకు మాత్రమే యేర్పడిన సంఘము
లవారు తమకర్తవ్యముల నిర్వహించుచుఁ బత్రికాముఖముల వానిని వెల్ల
డించుచున్నారు. ఆన్ధ్రదేశమున విశ్వతోముఖముగఁ బ్రచారమున నున్న
పత్రికలు సాధారణముగ గ్రామ్యభాషకును భావకవితకును బ్రాముఖ్య
ము నొసంగుచు నాన్ధ్రభాషాయోష యలంకారములఁ దీసివైచుటయే
గాక ముఖాద్యవయవములఁ గూడఁ గ్రమక్రమముగ ఖండించుచున్నవి.
ఇందులకు సుప్రసిద్ధవిద్వత్కవులే స్వీయవ్యాసనిశితాసిధారలఁ బ్రయో
గించి పోషించువారుగ నున్నారు. ఇట్టులే యాధునికకవికులశిరోమణులు
రచియించి వెలువడఁజేయుచున్న గ్రంథరాజములు గ్రామ్యభాషాభూయి
ష్ఠములై భావకవితావలంబిగీతమాలికలతో నిండి భావికవిమార్గదర్శకము
లై విశుద్ధాన్ధ్రభాషావినాశనోద్యమమును బోషించుచున్నయవి. మహో
ద్యమముతో నెట్టకేలకే తెంచి పనిచేయుచున్న యాన్ధ్రవిశ్వవిద్యాలయ
ము నుండి ప్రతివత్సరమునను దయారగుచున్న ప్రవీణు లేమి బి. యే.
మున్నగు పట్టపరీక్షలలో నుత్తీర్ణులైన విద్వన్మణు లేమి యాన్ధ్రభాషా
స్వరూపలోపమునకే యత్నించుచుండుట సర్వవిదితము. ఈయంశమును
వీరివ్యాసము లేమి వీరి గీతములేమి స్పష్టముగా ఋజువుచేయుచున్నవి
కదా. వీనివలన విశుద్ధాన్ధ్రభాష యత్యల్పకాలముననే స్వరూపలో
పము నొంది యపభ్రష్టరూపముతోనే యుండుదశకు వచ్చిన దని
లోకజ్ఞులకుఁ దేటతెల్లమే. అయిన నిటఁ గొన్ని యంశములు విచారణీయ
ములు కాకపోవు- విశ్వవిద్యాలయ పట్టపరీక్షలలో నుత్తీర్ణులైన
విద్వాంసులు భాష నిట్టిదశకుఁ గొనివచ్చుటకుఁ గారణము వా రేర్పఱ
చిన పాఠ్యగ్రంథములయందలి లోపమా- లేక యాయాకళాశాలలలో
నుండునట్టి యధ్యాపకుల యధ్యాపనమునందలి లోపమా- లేక య
ధ్యేతల యధ్యయనమునందలి లోపమా- లేక యుత్తీర్ణులగునీవిద్వ
త్పుంగవులు వశ్యభాషులై మతధర్మములయందు వలెఁ గలిప్రేరణమున
నపభ్రంశప్రచారముం గావించి భాషాసంస్కర్తలను విఖ్యాతిం గాంచఁ
దలఁచి బుద్ధిపూర్వకముగఁ జేయుచున్న సంస్కరణాభాసప్రవృత్తియా

యని విమర్శించునపుడు నిర్ణీత పాఠ్యగ్రంథములు భాషాతత్త్వవిజ్ఞానసాధకములును శాస్త్రతత్త్వవిజ్ఞానసాధకములు నైనయుత్కృష్టగ్రంథములే యగుటంబట్టి వానిలోప మరుటకు వలనుపడదు- కాని యవి విస్తరించి యేర్పఱపఁబడియుండుటంబట్టి యిప్పటి "టీపార్టీ"లలోని భోజ్యవస్తువులవలె నాస్వాదనమాత్రోపయుక్తములై తృప్తికరతత్త్వానుభావకములు కాకుండుటయుఁ దత్త్వలిప్సువులకుఁ దత్త్వగ్రహణానవకాశకములైయుండుటయు, నిష్కృష్టతత్త్వగ్రహణముతోఁ బరీక్ష్యులకు నిమిత్తములేదు, చవిచూచి యున్నఁ జాలు నని యుద్బోధించుచున్నవా యనునట్లు ప్రతికక్ష్యను బాఠ్యగ్రంథములకు నేర్పడియున్న సారబోధక(నోట్సు) గ్రంథముల నిర్మాణప్రచారణములును, గతవత్సరములలోని ప్రశ్నపత్రముల విక్రయము మున్నగు యూనివర్సిటీవారి యేర్పాట్లవలన నధ్యాపకులు నధ్యేతలును బాఠ్యగ్రంథములవంకఁ జూడక సారగ్రంథములను ప్రశ్నపత్రములను మాత్రమే యధ్యాపనాధ్యయనములలోనికిఁ గొనివచ్చుటకు వలను నవకాశము నేర్పఱచుటయే యీ భాషాదుర్దశకుఁ గారణ మని తోఁచెడిని- నేఁ గొందఱు హూణభాషావిద్యార్థులను ప్రాచ్యవిద్యాపరీక్షలకును జదువుచున్న విద్యార్థులను వారు చదువుచున్న గ్రంథములలోఁ జదివిన భాగములలోఁ బరీక్షించితిని- వా రాగ్రంథములలోని పద్యములనుగాని వాక్యములను గాని ప్రతిపదార్థవిజ్ఞానముతో నొక్కవ్యక్తియు సమన్వయింపలేకపోయిరి- "నోట్సుబుక్కు"లోనవుగుఁ డనియు మా కదే చెప్పుచున్నా రనియు హూణవిద్యార్థు లనిరి. ప్రవేశప్రవీణాదిపరీక్షలకుఁ జదువుప్రాచ్యవిద్యార్థులు వ్యాఖ్యానములతోఁ గూడఁ గష్టించి చదువవలసిన యుద్గ్రంథములలోనిమూలపంక్తుల యర్థములనైనఁ జెప్పనేరనివా రావత్సరముననే యటఁ గృతార్థు లైరి- పిమ్మట నిందుల కారణమును దృఢముగఁ గనుఁగొనఁగాఁ బ్రాచీనప్రశ్నపత్రములను వెలకుఁగొని వానిలోని ప్రశ్నములను సమాధానములను గురుసన్నిధిం దెలిసికొని వాని ధారణతో నుత్తీర్ణులైనట్లు ధ్రువముగఁ దెలిసికొని విచారించితిని- కనుక ప్రతిపదార్థజ్ఞానపూర్వకసమన్వయజ్ఞానముతో సవిశేషముగ నధ్యయనాధ్యా

ధనములు జరుగనప్పుడు సాధారణముగ నాభాషాగ్రంథములయందు వారి కెల్ల తత్త్వజ్ఞానము లభించును. ఇట్టిదశలో నతిబుద్ధిక్లేశమున సూక్ష్మబుద్ధితో సాధింపవలసిన తర్కవ్యాకరణాది శాస్త్రములలోఁ బ్రశ్నపత్రాధ్యయనమాత్రమున నెట్టిప్రావీణ్య ముదయించునో విజ్ఞులకుఁ దెలియును.

ఏశాస్త్రమునఁ దాను ప్రవీణతను నందెనో యాశాస్త్రమునం దలి యారంభగ్రంథములనే ప్రాచీనపద్ధతి నిప్పటిప్రవీణులు చాలవఱకు నధ్యయనము చేయలేకపోవుటకుఁ గారణము శాస్త్రాధ్యయనసాంప్రదాయములతో నాయాశాస్త్రములఁ జదువకుండుటయే గాని వేఱొండు లేదు-ఇట్లు చదువకుండుటకు ముఖ్యకారణ ముదరదరీపూరణసాధనము లగుపట్టముల నందికొనుటయందు మాత్రమే యధ్యేతలదృష్టులు ప్రసరించుచుఁ దత్త్వవిజ్ఞానసముపార్జనదృష్టులు లేకపోవుటయే యని విజ్ఞు లెఱుంగుదురు. ఏనాఁడు విద్యలు దేశీయులదృష్టులలో జ్ఞానసాధనము లనుస్వార్థమును విడనాడి పొట్టకూటికి సాధనము లనునర్థముతో గోచరించినవో యానాఁడే వానివిజ్ఞానసాధనత్వమునకుఁ దిలాంజలి ఘటించినది-“యూనివర్సిటీ”వారు శ్రమపడి యిట్టిపట్టముల నందినవారికే దేశీయవివిధకలాశాలలలో నధ్యాపకత్వము గౌరవము మున్నగువానిని నిర్ణయించియు నిర్ణయింపఁజేసియుఁ బ్రచారమునకై పాటుపడుచుండినను బ్రతివత్సరమునను వందలకొలఁదియును వేలకొలఁదియుఁ దయారగుచున్న ప్రవీణులకు నత్యల్పముగ నున్న దేశీయకలాశాలలలో నధ్యాపనస్థానములు లభింపకుండుటంబట్టియు నితరమార్గముల నుదరదరీపూరణముం జేసికొనుటకుఁ దమవిద్య లనుపయుక్తము లగుటంబట్టియు విజ్ఞానోదరపూరణోభయభ్రష్టతం జెంది యపభ్రంశప్రచారమునఁ దమకాలమును దమవిద్యల నుపయోగింపవలసిన వారగుచున్నారు-కనుక విద్యాశ్రద్ధార్థమును విజ్ఞానసాధనత్వము మీఁద నధ్యేతలదృష్టులు ప్రసరించునట్లు చేయుట విశ్వవిద్యాలయము వారి ముఖ్యకర్తవ్యమగుటచే నది యేనాఁడు ఘటించునో యానాఁడు విద్యార్థులకు ‘మార్కు’ల మీఁదఁ దృష్టియు విద్వాంసులకు మొదటితేదీ మీఁద దృష్టియుమరలి న్యాయయథార్థవాచకవిద్వత్పదవాచ్యులు దేశమునఁ దయా

రగుదురు. అట్లు కానంతవఱకును భాషలకును శాస్త్రములకును నీదుర్ద శ తప్పనిదై యుండును. అట్లు తయారగుటకు గ్రంథబాహుల్యమును దగ్గించి యధ్యయనకాలమును విస్తరింపఁజేసి సవ్యాఖ్యముగ నిష్కృష్టజ్ఞాన సాధక మగు పాఠ్యగ్రంథసముదాయము నేర్పఱచి నోట్సుబుక్కులను ప్రాచీనప్రశ్నపత్త్రముల విక్రయమును విరమింపఁజేసి నిష్కృష్టపరీక్షల నేర్పఱచుట సాధన మని నాయాశయము. అట్టివారు తయారైననాఁ డుదరదరీ పూరణమున కనేకమార్గములు లభించును. 'యథా రాజా తథా ప్రజాః' అనునది యిట ననువర్తించును కనుక విద్యాలయాధికారులదృష్టి తత్త్వ వేత్తలఁ దయారుచేయుటమీఁదఁ బ్రసరించినచోఁ దత్త్వవేత్తలే తయార గుదురు. పాశ్చాత్యదృష్టిని మాలించి ప్రాచ్యదృష్టిని గ్రహించుట దేశీ యులకు న్యాయ్యము. దేశీయవిద్యోద్ధారమున దేశీయదృష్టి ప్రసరింపని చో విదేశీయుల కెట్లు ప్రసరించును. వైదేశికవిద్యావిధానము స్వదేశీయ విద్యలకు విపరీతజ్ఞానసాధకత్వమును జేకూర్చుటలో వింతయేమి? కనుక యింతవఱకున్న విద్యావిధానమే తత్త్వగ్రాహకము కానందున నాంధ్రభా షకును బ్రాచ్యవిద్యలకు నిట్టిదుర్దశ నొనర్చుచున్న దని నాభావము. అధ్యయనకాలమున లేనితత్త్వజిజ్ఞాస యుత్తరణానన్తరమునఁ గలుగుట దు ర్లభము కదా. కలిగినను బ్రయోజనకారిణి కాదు. కనుక యధ్యయనకా లమున నేర్పడినయీదోషమును గప్పిపుచ్చుటకును గలిప్రేరణమున జనిం చిన పాశ్చాత్యవిధానానుకరణమును బ్రస్తుతాపభ్రంశప్రచారము విపరీత వాదములతోఁ బ్రారబ్ధమై తొలుత భాషామతల్లికయొక్క ముఖావయవ మును భ్రంశింపఁజేసి క్రమక్రమముగ నన్నియాన్ధ్రకాయావయవములను భ్రంశింపఁజేసి తుద కిప్పటికిట్టి యపభ్రష్టదశకుఁ గొనివచ్చినది. అస్ఖలి తము లగు ప్రాచీనగ్రంథములు మాత్రము భాషాయోషను సజీవముగ నిల్పినవి. ఇట్టిదశలో నాత్మరక్షణమునకై విలపించుచున్న యాంధ్రభాషా వధూటిని రక్షించుట కాంధ్రసాహిత్యపరిషత్తువారికన్నఁ దగువారు కా న్పింపరు. ఈపరిషత్తున కాంధ్రభోజుఁ డనివిఖ్యాతిఁగన్న శ్రీపీఠికాపురాధీ శులు ముఖ్యపోషకులై యుండ నాంధ్రకాళిదాసమహాకవి యన నగు శ్రీజయన్తి రామయ్యపంతులు వారు ప్రధానప్రవర్తకులై యుండ శ్రీభోజ

పారిషద్యపండితపుండరీకులఁ బోలుమహనీయులు పారిషద్యులై యుండ నాంధ్రభాషామహోద్ధారమున కన్నివిధములఁ జిరకాలమునుండి పాటుపడుచు ననేకప్రాచీనాముద్రితాంధ్రగ్రంథముల సేకరించుచు వానిరక్షణమునకై పత్త్రికలవ్రాయించి శక్యమైనంతవఱకు లోకమునకుఁ బ్రకటించుచు సలక్షణభాషను నవీనాంధ్రగ్రంథములను రచియించియు రచియింపఁజేసియుఁ బ్రకటించుటయుఁ జిరకాలమునుండి యమూల్యవిద్వద్రాజవ్యాసరాజదామములతోఁ బరిషత్పత్త్రికాపత్త్రికరములచే నాంధ్రభాషామణి నలంకరించుటయునున్నఘనకార్యము లన్నిటికన్న మిన్నయు ననితరసాధ్యము నగు శ్రీసూర్యరాయాంధ్రమహానిఘంటువు నిర్మింపఁజేసి ప్రకటించుచుండుటయునను మహాకార్యముల నొనర్చుచున్న యీపరిషత్తు వారుభయభాషానిష్ణాతసాహిత్యసంపాదకసద్గ్రంథముల నుత్తమమధ్యమాధమకక్ష్యావిశేషములతోఁ బరీక్ష్యములనుగా నేర్పఱచి సక్రమపరీక్షల నేర్పఱచి పారితోషికముల నొసంగుచు నుభయభాషాసాహిత్యతత్త్వవేత్త లగువిద్వాంసులను దేశమునకు దయచేయించుచు విశ్వవిద్యాలయమువారికిఁ గూడమార్గదర్శకులుగా నుండి యపభ్రంశప్రచారమున నుత్సన్నమగుదశకు వచ్చుచున్న యాంధ్రభాషామతల్లిక నుద్ధరించి తమకుఁ గలయీకొఱంతను దీర్చికొననిచో నాంధ్రభాష కిపుడుపట్టిన దుర్దశను బాపువా రెవ రాంధ్రదేశమున నుండరు. ఇట్టిముఖ్యకర్తవ్యాంశమున వీరి కింతవఱ కౌదాసీన్య ముదయించుట కూడఁ గలికృతభాషాదౌర్భాగ్య మనకతప్పదు. కనుక యన్నియంశములను సమర్థులగు విశుద్ధభాషాభిమానులు గలయీపరిషత్తువారు వెంటనే యిఁకనైనఁ దమకుఁ గొఱంతపడియున్న యీయనతరముఖ్యకార్య మగు నాంధ్రభాషాసాహిత్యపరీక్షాకార్యమునకుఁ గడంగి యాంధ్రభాష నుద్ధరింపఁగోరుచున్నారము. ఈకార్యమున వీరు వెంటనే ప్రవర్తించునటులు సర్వాన్తర్యామి సర్వేశ్వరుఁడు సర్వదా యనుగ్రహించి ప్రేరణమునొసర్చుచుండుఁగాత. విశుద్ధాంధ్రభాషామహామణి యాంధ్రదేశమున నఖిలాలంకారశోభితమై నిఖిలావయవలావణ్యవిలసితమై యపభ్రంశసంపర్కదోషలేశదూషితయుఁ గాకుండ సంతతము వెలయుఁగాత. సమస్తసన్మంగళానిసర్వేషాంభవంతు.

గ్రంథస్వీకారము.

(1) ఓదార్పు- (సారస్వతం)- దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు- నెల్లూరు-

వెల రు. 0-10-0.

గ్రంథకర్తగారి ప్రణయకుసుమకావ్యముపై 'సరస్వతిరాష్ట్ర నాగరకాచార్యుఁడు' వ్రాసిన విమర్శనమునకును, ములుమూడి నారాయణరెడ్డిగారి కాలగతితలపోత లను గ్రంథమునకును ప్రతివిమర్శనగ్రంథము. పైవిమర్శకులు గ్రంథకర్తల గురువర్యులును విద్వత్కవులునగు శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారిని మఱికొందఱను తీవ్రముగ విమర్శించియుండుటచే గ్రంథకర్త వారిని వారిగురువులగు కీ. శే. వేదము వేంకటరాయశాస్త్రిగారిని తత్తదుచితవాక్యముల విమర్శించిరి. విమర్శకవిషయములు కొలఁదిగను, పద్యగద్యరూపమున హేళనాదికము లెక్కువగను గలవు. ఇట్టివి పత్రికల నపుడపుడు వెలువడుచుండుటయే యాంధ్రుల దురదృష్టము. పుస్తకరూపమును దాల్చుటను గూర్చి చెప్పనేల? మలిపలుకున నిట్టిగ్రంథమును వ్రాయుట పొరపాటని గ్రంథకర్తలు గుర్తించియే యున్నారు. అది మొదటనే గ్రహించిన బాగుగనుండి యుండునేమో! విమర్శకుల 'తిట్టుపాతము వారికే యప్పగింతుగాక యని వారివాక్కులను వానివంటివానిని మఱికొన్నింటిని నేనును వాడితిన'ని గ్రంథకర్తలు వ్రాసిరి. ఇదియే గ్రంథస్వభావమును వివరించుచున్నది. పండితు లిట్టిగ్రంథములను వ్రాసి, కష్టపడి ముద్రణమొనర్చి తమధనమును, కాలమును, పాండిత్యమును వ్యర్థముచేయక, తమకుఁ దోఁచిన రీతిని భాషాసేవ యొనర్చుటయే యుత్తమ మని విన్నవించుచున్నాను.

(2) త్రిపురాంతకోదాహరణము:—రావిపాటి త్రిపురాంతకమహాకవిప్రణీతము- నిడుదవోలు వేంకటరావు బి. ఏ. గారిచేఁ బ్రకటితము- వెల రు. 0-12-0.

ఆంధ్రమునఁ గలయుదాహరణగ్రంథముల సుప్రసిద్ధ మగుదీనిని తంజావూరు సరస్వతీభవనప్రాచ్యలిఖితగ్రంథభాండాగారమునఁ గలప్రతి ననుసరించి ప్రథమమున శ్రీమానవల్లి రామకృష్ణకవి గారు ప్రకటించియుండిరి. దానినే విపుల మగుపీఠికతోడను, లఘుటిప్పణము తోడను బ్రకటించి గ్రంథప్రకాశకులు తమయాంధ్రభాషాభిమానమును బ్రకటించియున్నారు. త్రిపురాంతకుఁడు ప్రాచీనాంధ్రకవులచే సంస్తుతి నొందినకవివర్యుఁడు. సంస్కృతమునఁ బ్రేమాభిరామమును రచించె నని క్రీడాభిరామమునఁ గలదు గాని యది మన కలభ్యము. అంబికాశతకము, చంద్రతారావళి, మదనవిజయగ్రంథముల మనకు లభ్యములగు పద్యములు పీఠికయం దీయఁబడినవి. సంస్కృతోదాహరణగ్రంథములఁ గూర్చియు, నుదాహరణగ్రంథముల స్వరూపమును గూర్చియుఁ బెక్కువిషయములును గలవు. ఉదాహరణగ్రంథముల నుపయోగింపఁబడిన విభక్తిప్రత్యయముల వలన నేయేప్రత్యయము లేయేకాలములఁ గలవో నిశ్చయ మొనర్చుట సులభము కాదు. భాషాశాస్త్ర పరిశోధనలవలన నిర్ణయ మొనర్పవలసియుండును. 'నై' యనునది చతుర్థీవిభక్తిప్రత్యయము కాదు. న్ + అయి అని పదవిభాగ మొనర్చి స్వరూపనిర్ణయ మొనర్పవలసియున్నది. ద్వితీయభాగమున టీకాయుతముగ మూలము ప్రకటింపఁబడినది. టీక యింకను విపులముగ నుండవలయును. ఈగ్రంథ మాంధ్రభాష కత్యంతోపయోగము.

---

(3) మహోపాధ్యాయ బ్రహ్మశ్రీ కల్లూరి వేంకటరామశాస్త్రిగారి జీవితచరిత్రము:—గ్రంథకర్త చిలుకూరి వీరభద్రరావుగారు, వెల రు 1-0-0.

కీ. శే. శ్రీ వేంకటరామశాస్త్రిగారి జీవితవిశేషముల గ్రహించి గ్రంథకర్త లీవిపులగ్రంథమును రచించిరి. శాస్త్రిగారి రచనలగు వంశముక్తావళి, శ్రీకోటిలింగేశ్వరస్తోత్రము, నారసింహాష్టకము, స్త్రీనీతిరత్నావళి, చాటుశ్లోకములు నచ్చటచట నీయఁబడినవి. ఆంధ్రమేఘసందేశము, గుప్తార్థప్ర

కాశిక మొదలగుగ్రంథములపై విమర్శనప్రతివిమర్శనములు గలవు. నాఁటిదినములఁ బ్రచారములో నున్న కళావతీ, భారతీ పత్త్రికల శ్రీవేంకటరామశాస్త్రిగారును, వారి శిష్యులగు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారును జరపిన వాదోపవాదములు గలవు. వానిపై గ్రంథకర్త శ్రీవేంకటరామశాస్త్రిగారిని సమర్థించుచు వ్రాసినవిషయములు పెక్కులు గలవు. పీఠికయు దీని కనుగుణముగఁ గలదు. ఈవాదోపవాదములలోఁ గలవిషయములలోఁ జాలభాగము సహృదయరంజకములు గావని యు, నట్టివానిని వదలినచో నీగ్రంథము ప్రశంసార్హము గ నుండు ననియుఁ దలంచుచున్నాము. ఒకవేళ నట్టివాదములఁ దమయభిప్రాయముతోఁ బ్రకటించుటకే యీగ్రంథము రచింపఁబడినదేమో? వ్యక్తిదూషణాదులను వదలి, గ్రంథవిషయములనే గైకొని సహేతుకముగ నిష్పాక్షికబుద్ధితో విమర్శించుట యాంధ్రవిమర్శకులును జరిత్రకారులును ముఖ్యముగ నేర్చుకొనవలసియున్న దని మాయాశయము.

---

(4) బరోడా ప్రాచీనవస్తుపరిశోధనాసంఘప్రచురణములు:—ప్రకాశకులు శ్రీయుత హీరానందశాస్త్రిగారు.

(1) 1934-35 సంవత్సరకార్యనివేదిక.

(2) ప్రాచీనగ్రంథములఁ గప్పుడు చిత్రలేఖనము.

(3) గిర్నారులోని యశోకునిశాసనము.

సంస్కృత భాషకును ప్రాచీనహైందవవిజ్ఞానపరిశోధనములకును బరోడాదొరతనమువా రొనంగు సహాయ మనల్పము. వీరిసంస్కృతగ్రంథావళి యం దమూల్యమగు గ్రంథములు పెక్కులు ప్రచురింపఁబడినవి. ఇటీవల 1934-వ సంవత్సరమున బరోడామహారాజుగారిచే నీసంఘము స్థాపింపఁబడినది. మొదటివత్సరమున బరోడా రాజ్యమునఁ గలప్రాచీనశిల్పములు, కట్టడములు, శాసనములు పరిశోధింపఁబడి, యవి శిథిలముగాకుండు ప్రయత్నములు శాఖాధికారులచేఁ జేయఁబడినవి. మనదొరతనమువారి వార్షికనివేదికలంవలె వారికృషి మొదటిగ్రంథమున వివరింపఁబడినది.

ప్రాచీనగ్రంథములఁ జిత్రలేఖన మందందుఁ గన్పడుచున్నది. అందుఁగల చిత్రములు గ్రంథవిషయములకు సంబంధించినవై యతిమనోహరములై యున్నవి. అహమ్మదాబాదుమున్నగు స్థలములఁ గలఁ జైన భాండాగారముల నిట్టిగ్రంథసంపుటము లెన్నియేని గలవు. అందలి చిత్రలేఖనము మొగలుసామ్రాజ్యస్థాపనముకన్నఁ బ్రాచీనమైన హైందవసంప్రదాయముల వ్యక్తీకరించుచున్నది. మనప్రాచీనచిత్రలేఖనము గ్రంథములలోని విషయముల కెంతమాత్రమును సంబాధింపక యుండినదను పాశ్చాత్యవిద్వాంసుల యూహలను ఖండింప నీగ్రంథమును హీరానందశాస్త్రిగారు వ్రాసియున్నారు. కావ్యాలంకారగ్రంథములఁ గలఖడ్గాదిబంధములును నట్టిచిత్రలేఖనమున కుదాహరణము లని వారువ్రాసిరి. రామాయణమహాభారతములు, అనంగరంగాది కామశాస్త్రగ్రంథములును, తంత్రగ్రంథములు, భగవద్గీతయందలి దశమాధ్యాయము, పెక్కు జైనగ్రంథములు సచిత్రము లగుసంపుటము లింకను భారతదేశమునఁ బెక్కుస్థలములఁ గలవని యు నందలి జిత్రలేఖనములఁ బ్రకటించి భారతీయుల చిత్రకళాప్రావీణ్యమును విమర్శింపవలయు ననియు వీరు వ్రాసి యున్నారు. గ్రంథమును విశదీకరించుటకై యిరువది ప్రాచీనచిత్రము లీయఁబడినవి.

భారతీయులలో నశోకుని స్మరింపనివా రరుదు. అతనిశిలాశాసనములు దక్షిణదేశమునఁ గూడ వ్యాపించి, యతనిధర్మపరాయణత్వము, నహింసావ్రతమున్నగు సద్గుణములను ఘోషించుచున్నవి. వీనిని హుల్ష్, భండార్కరుమున్నగుశాస్త్రపరిశోధకులు ప్రకటించియున్నారు బరోడారాజ్యమునఁ గలగిర్నారుశిలలపై నశోకుని పదునాలుగు శిలాశాసనములు, రుద్రదామ, స్కందగుప్తుల శాసనములుఁ గలవు. ప్రాచీనచారిత్రపరిశోధకుల కివి యమూల్యములు. వీనిని మూలముతోడను, ఆంగ్లభాషాంతరీకరణముతోడను శాస్త్రిగారు ప్రకటించియున్నారు. అశోకుని పరిపాలనమును గూర్చిన ముఖ్యవిషయములు పీఠికయం దీయఁబడినవి. ఇట్టిగ్రంథములఁ బ్రకటించి భారతీయుల యౌన్నత్యమునకుఁ బాటుపడుచున్న బరోడాదొరతనమువారికిని, గ్రంథప్రకాశకులకును మనకృతజ్ఞతను దెలుపవలసియున్నది.

(5) Tirupathi Devasthanam Epigraphical Report and Inscriptions, text and translation. (3 Vols.)

తిరుపతిదేవస్థానము పురాతనపుణ్యస్థలములలో నొకటి. అందలి దైవ మగు శ్రీవేంకటేశ్వరులు విజయనగర రాజుల కిష్టదైవము. దేవస్థానపు కుడ్యములపై, పెక్కు ప్రాచీనశాసనములు గలవు. వానిలోఁ జాలభాగము దొరతనమువారు ప్రతిబింబములఁ దీసి దమ శాసనసంపుటములఁ బ్రచురించిరి. అయినను విశేషపరిశ్రమ మొనర్చి మహాంతు శ్రీప్రయాగదాసుజీ వారును, వారి ప్రాచ్యపరిశోధనాశాఖాధికారి యగు సుబ్రహ్మణ్యశాస్త్రి గారును నీమూఁడు గ్రంథములను ముద్రణ మొనర్చిరి. ఇందు మొదటిసంపుటమున దిరుపతిక్షేత్రము, నందలి దేవాలయములు, వాహనాదికములు వర్ణింపఁబడినవి. అందే, ద్వితీయభాగమున పల్లవ-చోళ పాండ్య యాదవవిజయనగర రాజులకును, నీక్షేత్రమునకుఁ గలసంబంధము, వారిచరిత్రమున కుపకరించుశాసనవిషయములు వివరింపఁబడినవి. రెండుమూఁడుసంపుటముల శాసనములు ఆంగ్లభాషానువాదముతోడను, విమర్శనముతోడను బ్రకటింపఁబడినవి. చరిత్రకారుల కీశాసనసంపుటములు మిక్కిలి యుపయోగకారులు. మూఁడవసంపుటము సాళువనరసింహరాయల శాసనములతో ముగియుచున్నది. మిగిలినశాసనసంపుటములను గూడ ద్వరలోఁ బ్రకటించి దేవస్థానాధిపతులు దాక్షిణాత్యచారిత్రపరిశోధనమున కమూల్యసహాయ మొనర్తు రని యాశించుచున్నాము.

---

(6) పురాణచిత్రములు:—శ్రీ పెద్దిభొట్ల కృష్ణశాస్త్రి గారు, కాకినాడ-(మూఁడు భాగములు). ఈగ్రంథభాగములు వేదాంతవిషయములు సామాన్యులకు దెలుపుటకై వ్రాయఁబడినవి. రామాయణభాగవతాదిగ్రంథములఁ గలయుపాఖ్యానములకు నాధ్యాత్మముగ నంతరార్థమును వివరించుటకు గ్రంథకర్తలు ప్రయత్నించిరి. అందు వీ రెంతవఱకుఁ గృతకృత్యతను గాంచిరో పాఠకులే యూహింపవలసియున్నది. భాషయు నస్వాభావికము. ఆంగ్లభాషాపదముల నాంధ్రీకరించుటలోఁ బడినశ్రమ వ్యక్తమగుచున్నది.

చ. [1]ఋతునయనాశ్వసప్తశశివీక్షణవార్ధిశిఖీందు లిందులోఁ
శతయుగళైకవృత్తములు ఛందము లిర్వదియాఱిటం బ్రశ
స్తత గలవానినామగణసంజ్ఞలు దార్కొన వళ్లుగూర్చి చే
సితి నిటు సంస్కృతాంధ్రకవిసింహులలక్షణరీతి మారుతీ. ౯౮

— పాదగోపనము. —

చ. ఘనహరి భానుజాప్త మతికంజభవా యతులప్రతాప భా
గ్యనిధి కృపాకరా జనకజాయతసుక్ష్రికచా మహాత్మ పా
వని వటుకేవ శూరచయవర్య సుధీసరసాద్య హృద్యశా
హనుమ జయప్రభాధికనయక్రమపావనచర్యసద్యశా.[2] ౯౯

—జగణచతుష్పందము—

వృక్షాటవంశతారా
ధృక్షా జన్యప్రభంజితాసురసైన్యా
యక్షయసుశౌర్యసంప
ద్దక్షా మాన్యరవిజప్రధానా ధన్యా. ౧౦౦

మాలిని. ప్రచురశుభచరిత్రా భక్తధాత్రీజచైత్రా
విచలితఃపుగోత్రా వీతిహోత్రాప్తపుత్రా
ప్రచరవనజమిత్రా దోషవల్లీలవిత్రా
యచలసదృశగాత్రా యక్షవృక్షాగ్నిహోత్రా. ౧౦౧

గద్యము. ఇది శ్రీ హనుమద్వరప్రసాదలబ్ధ సారస్వతపాత్ర భారద్వాజ గోత్రపవిత్ర సర్వయామాత్యపుత్ర చిత్రకవి పెద్దనార్యప్రణీతం బైన లక్షణసారసంగ్రహంబునందు- అక్షరలక్షణంబును, గురులఘుసంజ్ఞలును, గణనిర్ణయంబును, గావ్యస్వరూపంబును, గవినేతృస్వరూపంబును, అష్టాదశప్రాసభేదంబులును, సప్తవింశతియతిస్థితులును, ఉక్తాదిషడ్వింశతిచ్ఛందంబులం గల వృత్తసంఖ్యలలోఁ బ్రసిద్ధవృత్తలక్షణములునుం గల ప్రథమాశ్వాసము.

---

1. ౧౩౪౨౧౭౭౨౬.

2. ఈనాల్గవపాదము, మొదటి మూఁడుచరణములలోను గలయక్షరముల లో రెండువిడిచి మూఁడవదానిని దీసికొనుచు, ఎత్తి వ్రాసినచో నగును.

లక్షణసారసంగ్రహము

ద్వితీయాశ్వాసము.

క. శ్రీరఘునాయకపాదస
రోరుహయుగలోలహృదయరోలంబవరా
ఘోరశరవాలమారుత
వారితరిపుజలదవార వాయుకుమారా. ౧

వ. అవధరింపుము. ౨

గీ. అర్ధసమములు విషమము లనఁగ రెండు
గతుల సమవృత్తముల గణాక్షరములె యగు;
నర్ధసమములు ద్వివిధంబు లగుచు రెండు
జరగు స్వస్థానములుఁ బరస్థానము లన. ౩

గీ. విషమవృత్తంబులంకుఁ ద్రివిధము లగుచుఁ
దనరు స్వస్థానములుఁ బరస్థానము లన
వెండి సర్వపరస్థానవిషమ మనఁగ
నిన్నియును నైదుగతు లయ్యె నినజమంత్రి. ౪

సీ. సమముగా నాదిత్రిచరణంబు లొకట ద్వి
చతురంఘ్రు లొకట నాచందముననె
జరగు స్వస్థానార్ధసమ మిట్లు నాదిత్రి
చరణంబు లెత్తిచ్ఛందమునను
ద్విచతురంఘ్రులమీఁద వెలయుఛందమునఁ గూ
ర్చను పరస్థానార్ధసమము దనరు
ఛంద మొక్కటి గొని చరణము ల్వేఱుగా
విరచింప స్వస్థానవిషమ మయ్యెఁ
బాద మొకటనున్న పదము లితరఛంద
మునఁ బరస్థానవిషమసంజ్ఞను దలిర్చు
నాల్గుపదముల నాల్గుఛందములు దగుల
వెలయు సర్వపరస్థానవిషమ మనఁగ. ౫

వ. ఇందు స్వస్థానార్ధసమంబు లెట్టి దనిన:— ౬

గీ. నిశియు, విపరీతసంజ్ఞ యగు నిశి, రతిప్రి
యు, మజితప్రతా, పోపచిత్రాఖ్య లైన
యవియు, నారీప్లుతం బన నాఱుగతుల
జరగుచుండు స్వస్థానార్ధసమము లగుచు. ౭

౧. నిశివృత్తము.

జే సింద్రవజ్రంబునఁ జేర్చి రాఁగా
నెసంగఁగా సర్ల నుపేంద్రవజ్రన్
భాసిల్లఁగాఁ గూర్చియు బాగుమీఱ
న్నైన న్నిశీనామసువృత్త మయ్యెన్. ౮

ఇదే యుపజాతివృత్తము. దీనికే మఱియు-

ఈవింతతో బేసుల నింద్రవజ్రం
బివుర్పఁగా సర్ల నుపేంద్రవజ్రం
బీవైఖరిన్ రెండును నిట్లు గూర్ప
న్నవజ్రదేహా యుపజాతి యయ్యెన్. ౯

౨. విపరీతనిశివృత్తము.

ఇరస్తుతా బేసి నుపేంద్రవజ్రన్
హీరాంగ సర్లిందును నింద్రవజ్రన్
ధరాధిరాజా యిది దా ధరిత్రిన్
శ్రీరీతి నొప్పు న్విపరీతపూర్వన్. ౧౦

3. రతిప్రియవృత్తము.

ఖ్యాతి న్బేసుల సంప్రహర్షిణిం దలిర్పన్
యుతంబుగా రుచిరము యుక్పదంబులన్
నీతిం గూర్పఁగనుఁ మనీషు లైనకావ్య
ప్రతిప్రియం బనుచుఁ దలంతురా కృతిన్. ౧౧

౪. అజితప్రతాపవృత్తము.

అజరస్తుతాంగ ప్రమితాక్షరతో
నజమతిస్ఫుట ప్రియంవదాఖ్యతో

నజితప్రతాప మన నమ్యోనయా
సుజనకల్పకము సూరు లెంచఁగాన్. ౧౨

౫. ఉపచిత్రవృత్తము.

అసమంబుల సాసవ లంది యా
ర్యాసుత దోదక మయ్యెను సర్గ
ప్రసికస్తుత సద్గుణరత్న ఘో
రాసురభంజన యాయుపచిత్రన్. ౧౩

౬. నారీప్లుతవృత్తము.

బేసుల్ శాలిన్యాఖ్యవృత్తంబు గాఁగా
సీసూటితో సర్లను నింద్రవజ్రం
బైసీము న్నారీప్లుతాఖ్యాథ నామం
బోసత్యసంధా లసముజ్జ్వలాంగా. ౧౪

వ. ఇది స్వస్థానార్ధసమవృత్తాధికారం బింకఁ బరస్థానార్ధసమలక్షణంబు
నం గలవృత్తంబు లెట్టి వనిన— ౧౫

గీ. కేతుమతి వేగవతి వియోగిని ఖరావ
తియును ధృతమధ్యయును గోమలియును మణివి
తానకాంతి మనోహర దనరఁ బుష్పి
తాగ్ర భద్రవిరాట్టును నపరవక్త్ర. ౧౬

క. శ్రీనాయకభృత్య వర
స్థానార్ధసమంబు లివియుఁ దగుఁ బహునొకఁడై
పూని ప్రసిద్ధము లైనవి
గా నెఱుఁగఁగవలయు పీనిగతులు కవీంద్రుల్. ౧౭

౧. కేతుమతివృత్తము.

చను బేసుల న్సజసగాప్తి
న్భానుసమా సరిన్ భ్రనగగంబుల్
తనరం గవీంద్రతతి మెన్నం
దోనమరింపఁ గేతుమతి మించున్. ౧౮

౨. వేగవతీవృత్తము.
తగు బేసుల సత్రయగంబు
ల్బాగుగ దోదక పాటిలు సర్లం
బాగడొందఁగ నేర్పునఁగూర్ప
న్వేగవతీవరవృత్తము మించున్. ౧౯

౩. వియోగినివృత్తము.
అసమంబులయందు సాజగల్
వస సర్లందు సభరలవంబు లిం
పెసఁగ రచియింపఁ జెల్వ మ
య్యు సమర్థించు వియోగినిం దగన్. ౨౦

౪. పరావతీవృత్తము.
బేసులందు హంబు లాలు పెట్టి యాల
దెస నగంబు లాలు గం బదిన్సరి వ్రాఁ
జేసి రేఁ బరావతీప్రసిద్ధసంజ్ఞఁ
బొసంగుపేరి వృత్తమౌను భూరికీర్తి. ౨౧

౫. ధృతమధ్యవృత్తము.
అరయఁ దోదక మంటురు బేసు
ల్సరులను దోదకలక్షణ మొంకఁన్
మారుతి యాధృతమధ్యకు నెందు
స్సరసకవీంద్రులు సమ్మతిఁ గూర్పన్. ౨౨

౬. కోమలివృత్తము.
అనిలజ దోదక మా విషమాంఘ్రు
ల్జనస్తుతా రుచిర మొసంగు యుక్తులన్
ఘనతర మైతెగుఁ గావ్యములందు
న్వినంగఁ గోమలియను వృత్త మొప్పుగన్. ౨౩

౭. మణివితానకాంతివృత్తము.
రంగా శుద్ధవిరాట్టు బేసుల
స్సంగతి స్సరులఁ జాల్ రథోద్ధత

క్రంగఁ దాల్చి రఘుధురంధరా భ్రమా
తంగ వి స్మణివితానకాంతికిన్. ౧౮

౮. మనోహరవృత్తము.
చేసి న్గలికాంతను చేర్చియు నిం
పెసఁగ న్సితోటకవృత్తముతో
భాసిల్ల నొనర్చిన భవ్యయశో
విసరాఢ్య మనోహరవృత్త మగున్. ౧౯

౯. పుష్పితాగ్రవృత్తము.
పరఁగ నసమమందు భద్రికాగ
ల్సరులఁ బ్రభాత మెసంగుఁ బుష్పితాగ్రా
హరికులమణి యంజనాత్మజాతా
శరనిధిలంఘనశౌర్య సత్యసంధా. ౨౦

౧౦. భద్రవిరాట్టువృత్తము.
తాఁ జొ దసమాన తజగాప్తి
న్రాజి ల్భద్రవిరాట్టు గంబు సర్లం
దేజోవిజితార్క తేటగాఁగన్
భ్రాజద్భద్రవిరాడ్విధంబు మించన్. ౨౧

౧౧. అకరవక్త్రవృత్తము.
అనఘ యసమమున భద్రిక
జనపతి మాలిని సరయును ని
ల్చ నదియ యపరవక్త్రవృత్త మా
ననుచును సత్కవు లంద్రు మారుతీ. ౨౨

వ. ఇవి పరస్థానార్థసమవృత్తంబు లింక స్వస్థానవిషమంబు పరస్థానవిష
మంబు సర్వపరస్థానవిషమంబు ననంగల విషమవృత్తత్రయ లక్షణం
బు లె ట్లనిన. ౨౩

—:స్వస్థానవిషమవృత్తములు.:—

గీ. ధరణియు వరాంగి యంగజాస్త్రము నదీర
ఘోష మన నాల్గు పేరులఁ గొమరు మిగిలి

ఛందమొక్కటఁ దగిలి ప్రశస్త మగుచుఁ
దనరు స్వస్థానవిషమవృత్తంబు లనఁగ. ౩౦

౧. ధరణీవృత్తము.

గీ. జరగు నీనాలుచరణము ల్జగతియందె
ఋతుశరాద్రీందుల శిఖిధఋతుశశులను
యుగనవధరాబ్జుల నవాక్షినగహిమగుల
ధరణి కుదిష్టమున నిడఁదగును జేక్లు. ౩౧

మును నిఁల్చను, తోటకమున్ మఱిపై
జానుగాఁ దర్కవిశ్రాంతిరా రసముల్
స్వనయతి ననసనలా మమసా
ల్రానేనింట స్వళ్ళ గ్గుఖుగు ద్ధరణిన్. ౩౨

౨. వరాంగీవృత్తము.

ఇర న్బుధుల్ మెచ్చ నుపేంద్రవజ్ర
స్మరుత్తనూజా ప్రథమద్వితుర్యల్
హేరాళమై యుండఁగ నింద్రవజ్రన్
వరాంగికిన్ త్ర్యంఘ్రికి వైపుమాపున్. ౩౩

3. అంగజాస్త్రవృత్తము.

రూపయి మించ స్రుగ్మతిస్మృక్
దీపితమై యుండెన్ యరగాగాల్
ప్రాపై శుద్ధవిరాట్టునన్నితం
బై పైనర్థము నంగజాస్త్రమా. ౩౪

౪. నదీప్రఘోషవృత్తము.

చాల నాద్యంఘ్రికిన్ స్రగ్విణీవృత్తముం
దలంపఁగాఁ దక్కిన త్రిత్రయాంఘ్రులం
జెలంగ వంశస్థము జిత్రరీతి సం ౩౫
ధిలంగఁ గూర్పంగ నదీప్రఘోషమా.

వ. ఇవి స్వస్థానవిషమవృత్తంబు లనం దగు నింకఁ బరస్థానవిషమవృత్తం
బు లెట్లనిన. ౩౬

— పరస్థానవిషమవృత్తములు. —

క. శమ శరభక్రీడయు శ్రీ,రమణ రథగమన మనోహర మని యనెడు వృ
త్తము లీత్రయంబు విదళిత, విమత పరస్థానవిషమవృత్తము లయ్యెన్.

౧. అందుశరభక్రీడా వృత్తము.

కృతీశా చంద్రశ్రీప్రథమమున రెండింటియందున్
చతుర్థాంఘ్రిన్ రాఁగా మభసయ (సమూంచద్గణంబుల్)[1]
చాతుర్యంబొప్పఁగ సువిశాలరీతిన్ ద్రయమంఘ్రిం గూర్పన్
బ్రతిజ్ఞావాక్పాలా వినుము శరభక్రీడ యయ్యెన్. ౩౮

౨. శ్రీరమణవృత్తము.

రూపయి యాది న్రుగ్మవతి న్రా
నాపయి దోదకమంఘ్రుల మూఁటన్
దీపిత మైనను ధీరులు మెచ్చన్
శ్రీపతిసేవక శ్రీరమణం బౌ. ౩౯

౩. రథగమనమనోహరవృత్తము.

ప్రథి నసరజగాప్తిఁ బాటిలంగ నయ్యె
ప్రథమ తృతీయ చతుర్థ పాదముల్ జయోద్య
త్ప్రథ నజజరయ ద్విపాదయుక్తిఁ జెంద
ద్రథగమనమనోహరం బగున్ సుకీర్తీ. ౪౦

ఇవి పరస్థాన విషమవృత్తంబు లింక సర్వపరస్థానవిషమవృత్తంబు లెట్లనిన.

— సర్వపరస్థానవిషమవృత్తములు. —

గీ. తనర వీణారచన యుద్గతంబు మధుర
యనఁగ మణిదీపికయు నన నమరు నాల్గు
పేళ్లుగలిగినవృత్తముల్ పృథులశౌర్య
వినుము సర్వపరస్థానవిషమ మగుచు. ౪౨

౧. వీణారచనవృత్తము.

స్ఫారంబుగ నాదిఁ దయసాగురువుల్రా
నా రెండవయంఘ్రి తజనభాప్తిగగం బై
భారంజిత మూఁట తజనభల్ సగణము వీ
ణారచన కగు భనజన ల్గురువు తుదన్. ౪౩

1. మభసయ...చంచద్గణంబుల్. మూ.

లౌకికన్యాయవివరణము.

లోకోక్తులు, సామెతలు, ఆభాణకములు (శ్లోకరూపములు) న్యాయములు మొదలగునవి యన్నియును గొప్పలోకానుభవము గల పెద్దలసూక్తులు. తెలుఁగుభాషలో వాడుకచేయఁబడు సామెతలు ప్రతి వారికి సుబోధములు కావున వానికి వివరణ మవసరము లేదు. కాని వ్యాకరణగ్రంథములును, న్యాయవైశేషికాదిగ్రంథములును, పూర్వమీమాంస, ఉత్తరమీమాంస, ఉపనిషద్భాష్యములు, అలంకారశాస్త్రము, శుక్రనీతి, కామందకీయాది నీతిశాస్త్రగ్రంథములు మొదలగువానియం దాయాగ్రంథసందర్భములయం దుదాహరింపఁబడిన యీన్యాయములే వివరణాపేక్షములు. వీనియందు శాస్త్రసంప్రదాయములు, పారిభాషికపదములు మెండుగా నుండుటచేఁ బండితైకసమధిగమ్యములు. భగవద్గీతలయందు దశోపనిషత్తులయందుఁ బ్రయోగింపఁబడిన కఠినపదముల కర్థముతో నకారాదిగాఁగల యొకసంపూర్ణసూచిని వ్రాసి ప్రకటించిన పాశ్చాత్యపండితశిరోమణి యగు కర్నల్ జయజాకూబీపండితుఁడు సకలశాస్త్రగ్రంథములను శ్రద్ధతోఁ బరిశీలించి యీన్యాయములను సంగ్రహించి వాని నన్నింటి నాంగ్లేయభాషలో వివరించి మూఁడుభాగములుగా నచ్చొత్తించి ప్రకటించెను. దానికి "లౌకికన్యాయమాల" యని పేరిడెను. ఆగ్రంథము సంస్కృతాంగ్లేయభాషలలోఁ బ్రవేశ మున్నవారికి గాని యితరుల కుపయోగింపదు. అందుచే నేను వానిలో ముఖ్యమైన న్యాయములఁ గొన్నింటిని దీసి మనపాఠకుల కుపయోగించునట్లు తెలుఁగుభాషలో వివరించుటకు సమకట్టితిని.

ఇదిగాక యీలౌకికన్యాయములను బ్రతిపాదించు విస్తృతమైన గ్రంథము మఱియొకటి కలదు. దానిపేరు "భువనేశదత్తలౌకికసాహస్రి." అది బొంబాయినగరమునకు శాఖానగరమైన కళ్యాణిలో గంగావిష్ణు శ్రీకృష్ణదాసు, అనువర్తకుని లక్ష్మీవేంకటేశ్వరముద్రాక్షరశాలలో ముద్రి

తమైనది. ఈగ్రంథము జాకోబీపండితుని గ్రంథముకంటె విపులతర మైన వ్యాఖ్యానముతో వ్రాయఁబడినది. దీని నామూలాగ్రముగాఁ బరిశీలించి యిందుఁ గలముఖ్యమైన న్యాయముల నిందులోఁ గూర్చితిని. ఈగ్రంథకర్తవృత్తాంతమును యథాజ్ఞాతముగా నీవ్యాసమందుఁ దెలుపుచున్నాను. తొల్లి మూలత్రాణనగర మను (Mooltan) నొకపట్టణమం దధీతసకలవేద శాస్త్రాగమేతిహాస పురాణకలాపుఁడు జ్యోతిశ్శాస్త్రపారంగతుఁడు "ఆశానందుఁ" డను నొకవిప్రవర్యుఁడు గలఁడు.

అతఁడు సారస్వతసేతుపాల మనువంశమందుఁ బుట్టినవాఁడు. అతనికి ఠాకురుదత్తుఁ డను నొకపుత్త్రుఁ డుదయించెను. ఇతఁడు కూడఁ గాలక్రమమునఁ దండ్రివలెనే మహావిద్వాంసుఁడై నానాదేశసంచారము చేసి సకలరాజస్థానములయందు సన్మానితుఁడయ్యెను. తరువాతఁ గొంతకాలమునకు ఠాకురుదత్తునకు విక్రమార్కశకము ౧౯౩౮ సం. లో భువనేశదత్తుఁ డను నొకకుమారుఁ డుద్భవించెను. విద్యాభ్యాసోచితవయస్కుఁడై పాఠశాలకుఁ బోయి కొంతకాలము చదివి ప్రథమపరీక్షయం దుత్తీర్ణుఁ డయ్యెను. ఈకాలమందు శ్రీరామనగరవాస్తవ్యుఁడగు నొకకులీన బ్రాహ్మణుఁడు వచ్చి యీభువనేశదత్తునకుఁ దనకొమార్తె నిచ్చెద నని ప్రతిజ్ఞఁ జేసెను. భువనేశునితండ్రియును వివాహమహోత్సవమును నిర్వర్తించెను. కొంతకాలము చన్నపిదప నతనికి నరేంద్రుఁ డను పుత్త్రుఁడు పుట్టెను. అపుడు భువనేశుఁడు మరల బడికిఁ బోయి మధ్యమపరీక్షకుఁ జదివెను. కాని దైవవశమునఁ బరీక్షయం దుత్తీర్ణుఁడు కాఁజాలక పోయెను. అయినను లవపురమునకుఁ బోయి యచట ముప్పదిరూప్యముల యుద్యోగములోఁ బ్రవేశించి ధనాసొమ్ముచు, తండ్రికిఁ బంపించుచుండెను. ఆంగ్లేయభాషయందుఁ గూడ మంచిప్రవేశమును సంపాదించెను. కొంతకాల మైనతరువాతఁ, దండ్రియాజ్ఞచే స్వగ్రామమునకు మరలి వచ్చెను. నరేంద్రుఁడు నాలుగువత్సరములు వయస్సు గలవాఁడై యుండఁగా భువనేశుఁడు తలిదండ్రులను బంధువర్గమును మిత్రబృందమును శోకసాగరనిమగ్నులను జేసి యాకస్మికముగా దేవభూయము నొందెను. తద్వం

కజుఁడు భువనేశదత్తుని పితామహుఁ డైనతారకదత్తుని ప్రియశిష్యుఁడు నగు తేజోభానుశాస్త్రి యనుపండితుఁడు భువనేశుని స్మృత్యర్థముగా నీలౌకికన్యాయసాహస్రి యనుగ్రంథమును రచియించి లోకమున కిచ్చెను.

న్యాయములు.

౧. ఫలవత్సహకారన్యాయము.

"ఆమ్రే ఫలార్థే రోపితే ఛాయాగన్ధా అనూత్పద్యేతే" అని యాపస్తంబసూత్రము. పండ్లకొఱకుఁ దియ్యమామిడిచెట్టును మొలవేయఁగా ఫలమే గాక నీడ, సౌగంధ్యము కూడ, సంప్రాప్తమగును. ఏకఫలము కొఱకుఁ బ్రయత్నము చేయువానికి దైవయోగమున నన్యఫలములు కూడఁ జేకూరును.

౨. వృద్ధబ్రాహ్మణవరన్యాయము.

తొల్లి జాత్యంధుఁడు, అత్యంతదరిద్రుఁడు, బ్రహ్మచారి యు నైన యొకవృద్ధబ్రాహ్మణుఁ డుండెను. అతఁడు బహుదుఃఖపీడితుఁడై తీవ్రతపస్సుచేతఁ బరమేశ్వరు నారాధించెను. అతని తపస్సుచేతఁ బ్రీతుఁడై పరమేశ్వరుఁడు స్వాభీష్టమైన యొకవరమును యాచింపు మని చెప్పెను. అంత నావిప్రుఁడు "కన్నులిమ్మని కోరిన దారిద్ర్యదుఃఖ మెప్పటివలె నుండును, భార్య కావలె నని యాచించిన నంధత్వదారిద్ర్యసంతత్యభావములు దుఃఖమును బుట్టించును. ధనము కోరిన దానిని జోరు లపహరింతురు" అని యిట్లు నానావిధచింతాసమాకులుండై యేమియును దోఁపక కొనకు స్వపౌత్రుని రాజసింహాసనమం దున్నవానినిగాఁ జూడఁ గోరెద నని వర మడిగెను. అంత సర్వేశ్వరుఁడు వానిబుద్ధికౌశలమునకు సంతసిల్లి యాబ్రాహ్మణునికిఁ గన్నులును ధనమును రూపవతి యైన భార్యను ననుగ్రహించెను. కావున-

"పితా మాతా సుహృద్భ్రాతా బాంధవా గురవో వ్యధా, ఏకైకఫలలాభాయ సర్వలాభాయ కేశవః"- అన్నట్లు సర్వేశ్వరుఁడు సర్వఫలప్రదుఁడు.

3. కంఠచామీకరన్యాయము.

తనకంఠమం దున్న స్వర్ణభూషణమును దాను మఱచిపోయి దానిని పైనివెదకుట- "యథా హిరణ్యనిధి మక్షేత్రజ్ఞా ఉపర్యుపరి సంచరన్తో న విన్దేయుః" (భూమియందుఁ బాతఁబడి యుండిన బంగారునిధిని పైపైని సంచరించు క్షేత్రజ్ఞులైన మనుష్యు లెట్లు కానఁజాలరో) అని ఛాందోగ్యశ్రుతి- "య ఆత్మని తిష్ఠన్- య మాత్మా న వేద, ఆత్మాన మన్తరో యమయతి" అని యంతర్యామిబ్రాహ్మణము. (ఎవఁ డాత్మలో నున్నాఁడో, ఎవని నాత్మ యెఱుఁగదో, ఎవఁడు లోపలనుండి యాత్మను నియమించుచున్నాఁడో) "దురధిగమో ఽసతాం హృదిగతో ఽస్మృతకణ్ఠమణిః"(భాగవతము శ్రుతిగీతులు 3౯ శ్లో)"యది న సముద్ధరన్తి యతయో హృది కామజటా దురధిగమో ఽసతాం హృదిగతో ఽస్మృతకణ్ఠమణిః."

౪. అర్కే చే న్మధు విన్దేత కిమర్థం పర్వతం వ్రజేత్
ఇష్టార్థస్య చ సంసిద్ధౌ కో విద్వాన్ యత్నమాచరేత్.

అర్కము- అనఁగా గృహకోణము- ఇంటిమూలలను తేనె దొరకిన యెడలఁ బర్వతమున కేల పోవలెను. తాను గోరినవస్తువు సులభముగా లభించినచోఁ బ్రాజ్ఞుఁ డెందులకు శ్రమపడవలయును. తనయం దున్న పరబ్రహ్మమును దెలిసికొని బ్రహ్మవేత్త యజ్ఞదాన తపస్తీర్థయాత్రాదుల యందు విగతోత్సాహుఁ డగును.

"అర్కేచే న్మధు విన్దేత" అని మఱియొకపాఠము గలదు. అర్క మనఁగా జిల్లేడుచెట్టు. ఈన్యాయము శాంకరబ్రహ్మసూత్రభాష్యము, 3-౪-3 లో నుదాహరింపఁబడినది. "కేవలాచ్చేత్ జ్ఞానాత్పురుషార్థసిద్ధి స్స్యా దనేకాయాస సమన్వితాని కర్మాణి తే కిమర్థం కుర్యుః, అర్కే చే న్మధువిన్దేత కిమర్థం పర్వతం వ్రజేత్ ఇతి న్యాయాత్- శాబరభాష్యము ౧-౨-౪. పూర్వపక్షి చెప్పుమాట-"తద్యథా కథిచా తేఽర్కే మధూపలభ్యతే నైవ కథా మధ్వర్థినః పర్వతం న గచ్ఛేయుః తాదృశం హి తత్, అర్కే చే న్మధువిన్దేత కిమర్థం పర్వతంవ్రజే దితి న్యాయాత్

౫. అర్ధజరతీన్యాయము.

అర్ధజరతీ=సగము ముసలిది. దీనియర్థ మిది యని నిశ్చయించి చెప్పుట నిక్కిలి కష్టము- దీనియర్థనిర్ధారణమందు శాస్త్రజ్ఞులు భిన్నాభిప్రాయులై యున్నారు. వర్ధమానుఁడు గణరత్నమహోదధిలో ౩-౧౯౫. నిట్లు వివరించెను. "కాకతాళం చ ఖల్వాటబిల్వే చాంధకవర్తకం। అర్ధాచ్చ జరతీ శ్యేనాత్కపోతో ఘుణతోఽక్షరమ్॥ "యథా స్త్రీ న తరుణీ శ్లథస్తనత్వాత్ కృష్ణకేశత్వాచ్చ జరతీ వక్తుం శక్యతే, తద్వత్సిద్ధాసిద్ధం ప్రయోజనం" అవయవములు శిథిలముగా నుండుటచేఁ బడుచుకాదు, కేశములు నల్లగా నుండుటచే నంతముసలి దనియునుఁ జెప్పలేము- ఈ న్యాయమును శంకరాచార్యులవారు బ్రహ్మసూత్రభాష్యమందిట్లుదాహరించియున్నారు. ౧-౧-౧౯. యథా అన్నరసమయః ప్రాణమయ ఇత్యాదౌ వికారార్థే మయట్ప్రవాహే సతి ఆనందమయ ఏవాకస్మాదర్ధజరతీయన్యాయేన కథ మివ మయటః ప్రాచుర్యార్థత్వం బ్రహ్మవిషయత్వం వా శ్రీయత ఇతి" దీని కనిశ్చితస్వభావము గలకార్య మని కొందఱు- సంశయితవాక్యని మఱికొందఱు నర్థము చెప్పిరి.

౬. తృణజలూకన్యాయము.

తృణము=గడ్డిపరక—జలూకా=జలగ. జలం ఓకః యస్య సః జలౌకాః- జలగ యింకొక గడ్డిపరకను బట్టుకొని గాని పూర్వపు గడ్డిపరకను విడువదు. ఆరీతిగానే ప్రాజ్ఞుఁడు మఱియొక పదవిని సంపాదింపనిదే పూర్వపుఁ బదవిని విడువఁడు. ఈన్యాయము-బృహదారణ్యకోపనిషత్తు ౪-౪-౩ లోఁ జెప్పఁబడినది. "తద్యథా తృణజలూకా తృణస్యాంతం గత్వా అన్య మాక్రమ మాక్రమ్యాత్మాన ముపసంహరత్యేవ మేవాయ మాత్మేదం శరీరం నిహత్యావిద్యాం గమయిత్వా అన్యమాక్రమ మాక్రమ్యాత్మాన ముపసంహరతి"

౭. స్థూణానిఖననన్యాయము.

స్థూణా=స్తమ్భము, రాట-నిఖననము=పాఁతుట—

మన మొక పందిరిరాటను బాఁతినపు డది దృఢముగా నున్న

దో లేదో యని పరీక్షించుటకు దానిని నాలుగువైపుల నూపి చూతుము. అట్లే మన మొకమనుష్యుని యిష్టానిష్టములను గనుఁగొనుటకు దానికున్న సాధకబాధకములను జెప్పి వానినన్నిటిని స్థిరపఱచెదము. ఈ న్యాయము, శాంకరబ్రహ్మసూత్రభాష్యములో ౨.౧-౩౮ నుదాహరింపఁబడినది. "పునశ్చ జరాజన్మాదిహేతుత్వ మీశ్వర స్యాఙ్గీకృత్యతే స్థూణానిఖననన్యాయేన ప్రతిజ్ఞాత స్యార్థస్య దృఢీకరణాయ."

౮. సింహావలోకనన్యాయము.

సింహ మరణ్యములో నాహారార్థమై యొకజంతువును వధియించి తనకుఁ బ్రతిస్పర్ధి యగు మఱి యొకమృగ మేదైన వచ్చుచున్నదేమో యని వెనుకకుఁ జూచుట దానికలవాటు. అట్లే యొకపద్యమందుఁగాని శ్లోకమందుఁ గాని కొనయున్న పదము పద్యాదియందుఁ గాని శ్లోకాదియందుఁ గాని యున్నపదముతో నన్వయించుటకు సింహావలోకన మని పేరు. ఎట్లనఁగా- నరసభూపాలీయము. 4 ఆశ్వా.

క. మనవేటికి నూతనమా
తనమాఱెకఁ బ్రేమ తనకుఁ దక్కితి ననుమా
నను మానక దయ దనరం
దనరంతులు మాని నరసధవు రమ్మనవే.

ఈపద్యమునకు కొన నున్న "రమ్మనవే" అనుపదము, మొదటనున్న "మన వేటికి" అనుపదముతో నన్వయించుచున్నది.

ఈన్యాయము ఆచార్యహేమచంద్రుని పరిశిష్టపర్వములో ౧-౬3 నిట్లు ప్రయోగింపఁబడినది. "సింహావలోకనన్యాయే నాలీకః పుత్రకే జసా, ప్రత్యగ్రా నివ సోఽద్రాక్షీత్ తా నమాత్యా న్సతద్విషః".

౯. కాకాక్షిగోళకన్యాయము.

దీనినే తఱచుగా "కాకాక్షిన్యాయ" మందురు. కాకి కొక్కటే కన్నని లోకు లనుకొందురు, గాని, యది కాదు. దాని కొక్కటియే నేత్రగోళము (కన్నుగ్రుడ్డు). అది దాని యవసరమునుబట్టి రెండువైపులకుఁ దిరుగును.

అల్లే రొయొక్క శ్లోకము దొకపదము వెనుకపదముతోను ముందుప దముతోను నన్వయించినపు డది కాకాక్షిన్యాయముగా నన్వయించు చున్న దని వ్యాఖ్యాతలు వ్యవహరింతురు. ఎట్లనఁగా; "ద్వీపోఽస్త్రియా మన్తరీపః" అని యమరము. ఇచట "అస్త్రియాం" అను పదము ద్వీపశబ్దముతోను, అన్తరీపశబ్దముతోడను నన్వయించుచున్నది.

౧౦. గడ్డాలికాప్రవాహన్యాయము.

గడ్డాలికా=గొఱ్ఱె—గొఱ్ఱెలమంద పోవుచుండఁగా మార్గమధ్యమం దొకనది ప్రవహించుటను జూచి దానియొక్కన గొఱ్ఱె లన్నియును గొంతసేపు నిలువఁబడి కొన కొక గొఱ్ఱె దాఁటుటను జూచి మందలోని గొఱ్ఱె లన్నియును దానివెనుకనే పోవును. ఆరీతిగా లోకములో నొకఁడు మంచిపనిని గాని చెడ్డపనిని గాని చేసినచోఁ దక్కినవా రందఱు, గతానుగతికముగా వానినే యనుసరింతురు.

ఈశబ్దమునకు నాలుగురూపములు కానవచ్చుచున్నవి.౧.గడ్డరికా. ౨. గడ్డలికా. ౩.గడ్డారికా. ౪. గడ్డాలికా—వీనిలో నెద్ది శుద్ధరూపమో నిశ్చయముగాఁ దెలియదు.

ఈన్యాయము కావ్యప్రదీపాష్టమోల్లాసప్రారంభమందు ౩౨౬పుట "గడ్డలికా మేషీ కాచి దేకా కేనచి ద్ధేతునా పురో గచ్ఛతి ఇతరాస్తు వి నైవ నిమిత్తవిచారం తా మనుగచ్ఛన్తి"

౧౧. గుడజిహ్వికాన్యాయము.

తలిదండ్రులు మందు త్రాగ నని యల్లరిచేయు బాలుని నాలుక పైని ముందు బెల్లమును రాచి పిదప మందును త్రాగింతురు. అట్లే యజ్ఞాదికర్మలు చేయుట కష్ట మని తలంచి వానిలోఁ బ్రవర్తింపని పురుషుని వేదము "అక్షయ్యం హ వై చాతుర్మాస్యయాజిన స్సుకృతం భవతి" (చాతుర్మాస్యయాజియొక్క పుణ్య మక్షయము) అను ప్రరోచనావాక్యముచేఁ గర్మయందుఁ బురుషుని బ్రవర్తింపఁ జేయును. ఈన్యాయము కావ్యప్రదీపిక—౬వ పుటలో వివరింపఁబడినది. "యే సుకుమారమతయోఽ

తిసుఖస్వభావా రాజకుమారాదయో నీరసే నీతిశాస్త్రే ప్రవర్తయితుమశక్యా స్తా న్కావ్యం కా న్తేవ సరసతాపాదనే నాభిముఖీకృత్యోపదేశం గ్రాహయతి గుడజిహ్వికయా శిశూ నివౌషధమ్"-యథాహుః-స్వాదుకావ్య రసో న్మిశ్రం వాక్యార్థ ముపభుఞ్జతే-ప్రథమాలీఢమధవః పిబన్తి కటుభేషజమ్.

౧౨. గోబలీవర్దన్యాయము.

“ఉక్షా భద్రో బలీవర్ద ఋషభో వృషభో వృషః అనడ్వాన్ సౌరభేయీ గౌః” అని యమరనిఘంటువు. ఈశబ్దము లన్నియు వృషభపర్యాయములు. గామానయ, బలీవర్దంచానయ (గోవును గొనితెమ్ము, బలీవర్దమును దెమ్ము) గోపదముచేతనే “ఎద్దు” అని యర్థ మగుచుండఁగా బలీవర్దశబ్ద మేల? అంటే-బలీవర్దపదము దుర్దమ్యత్వమును (లొంగనియెద్దు) అని తెలియఁజేయుటచే నది సఫల మగుచున్నది. బ్రాహ్మణపరివ్రాజకన్యాయము- బ్రాహ్మణవసిష్ఠన్యాయము- దీనితో సమానములే.

౧౩. ఘట్టకుటీప్రభాతన్యాయము.

ఘట్ట="హాస్సీలు" కుటీ=పాక, గాటిపాక, మెట్టుపాక —ఒకబండివాఁడు తనబండికి “హాస్సీలు” తప్పించుకొనవలె నని దురూహచే మఱియొక దారిలో బండిని దోలి దారి తప్పి తిరిగి తిరిగి కొనకుఁ బ్రభాతసమయమునకు, ఆమెట్టుపాక దగ్గఱకు వచ్చెను. మెట్టువాఁడు వీనిదగ్గఱ సొమ్ము వసూలుచేసెను. సొమ్మిచ్చుకొనెను. ఎడ్లకుఁ దనకు రాత్రియంతయు శ్రమ కలిగెను. తనయిష్టము సిద్ధింపలేదు. ఇష్టసిద్ధ్యలాభము దీని తాత్పర్యము. ఈన్యాయము మాధవాచార్యవిరచిత సర్వదర్శనసంగ్రహమం దిట్లు చెప్పఁబడినది. “నను స్ఫోటవాచకతాపక్షేపి ప్రాగుక్తవికల్పప్రసరేణ ఘట్టకుటీప్రభాతాయిత మితిచే త్తదేత న్మనోరాజ్యవిజృమ్భణం వైషమ్యాసమ్భవాత్.”

౧౪. ఘుణాక్షరన్యాయము.

ఘుణ మనఁగాఁ బురుగు, దానిచేఁ దొలవఁబడిన యక్షరము-పురుగులు కఱ్ఱలమీఁదఁ బుస్తకములమీఁదఁ దొలిచినగీఁతలు యాదృచ్ఛిక